విశాఖపట్టణం
బుధవారం 24 జూన్ 2026

For a pure tomorrow..

జయ జయహే

epaper.jayajayahey.com సంపుటి: 9 సంచిక:151 వెల: రూ.5/- పేజీలు: 8

Published From Visakapatanam Circulated by Ananthapur, Kadapa, Chittor, Srikakulam, Vijayanagaram, Thirupathi, Ongole, East, West Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool

# కాబోయే భర్తను లోయలోకి తోసేసి..



ప్రమాదశావత్తు మరణంగా చిత్రీకరణ


ప్రియుడుతో కలసి కాబోయే భర్త హత్య

పోలీసులు విచారణలో వాస్తవాలు బట్టబయలు

2

# రూ. 34 వేల కోట్ల పెట్టుబడులకు పచ్చజెండా





గ్రీన్ ఎనర్జీ, డేటా సెంటర్లు, పర్యాటక రంగంలో పెట్టుబడులు

అమరావతి బృహత్తర ప్రణాళికకు ఓకే

ఆధ్యాత్మిక, పర్యాటక ప్రాజెక్టులకు గ్రీన్ సిగ్నల్

80కి అజెండా అంశాలకు కేబినెట్ అంగీకారం

(అమరావతి - జయజయహే)

ఆంధ్రప్రదేశ్ సమగ్రాభివృద్ధి, పారిశ్రామిక ప్రగతి లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ఈ భేటీలో దాదాపు 80కి పైగా అజెండా అంశాలపై సుదీర్ఘంగా చర్చించిన క్యాబినెట్, వాటన్నింటికీ పచ్చజెండా ఊపింది. రాష్ట్రంలో భారీగా పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడమే ధ్యేయంగా ఈ సమావేశంలో వ్యూహాత్మక అడుగులు పడ్డాయి. రాష్ట్రంలో ఆర్థిక రంగాన్ని పరుగులు పెట్టించేందుకు వీలుగా స్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డ్ సిఫార్సు చేసిన దాదాపు రూ.34,000 కోట్ల విలువైన పెట్టుబడి ప్రతిపాదనలకు మంత్రివర్గం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ భారీ పెట్టుబడుల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా సుమారు 35,000 మంది యువతకు నూతన ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. పరిశ్రమలు, సమాచార సాంకేతికత), గ్రీన్ ఎనర్జీ (పునరుత్పాదక ఇంధనం), డేటా సెంటర్లు, పర్యాటక రంగాల్లో ఈ పెట్టుబడులు కేంద్రీకృతం కానున్నాయి. నవ్యాంధ్ర రాజధాని అమరావతిని అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించేందుకు క్యాబినెట్ బృహత్తర ప్రణాళికలను ఆమోదించింది. ఉండవల్లి పరిసర ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పన కోసం రూ.426 కోట్లు కేటాయించేందుకు మంత్రివర్గం అంగీకరించింది. రాష్ట్ర జ్యుడిషియల్ అకాడమీ శాశ్వత భవన నిర్మాణ పనుల కోసం రూ.139 కోట్ల వ్యయ ప్రతిపాదనలకు ఆమోదముద్ర పడింది. అమరావతి ల్యాండ్ పూలింగ్ స్కీమ్ ఫేజ్-1, ఫేజ్-2 పనులను వేగవంతం చేయడానికి వీలుగా సీఆర్డీఏ పరిధిలో 95 డిప్యూటీ కలెక్టర్లు, తహసీల్దార్ల తాత్కాలిక పోస్టుల మంజూరుకు ఓకే చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోని వివిధ ప్రభుత్వ ..మిగతా 2లో



# పద్మ పురస్కారాలు ప్రదానం

### విశిష్ట సేవలందించిన 65 మందికి అవార్డులు

(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)

న్యూఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో రెండో విడత పద్మ పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. వివిధ రంగాల్లో దేశానికి విశిష్ట సేవలు అందించిన 65 మంది ప్రముఖులకు భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తన చేతుల మీదుగా ఈ ప్రతిష్టాత్మక అవార్డులను అందజేశారు. ఈ విడతలో మొత్తం 2 పద్మ విభూషణ్, 7 పద్మభూషణ్, 56 పద్మశ్రీ పురస్కారాలను కేంద్ర ప్రభుత్వం ప్రదానం చేసింది. ఈ అవార్డుల ప్రదానోత్సవంలో కళలు, వైద్యం, క్రీడలు, సాహిత్య రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు పురస్కారాలను అందుకున్నారు. ముఖ్యంగా మలయాళ చిత్ర పరిశ్రమలో తన అద్భుత నటనతో గుర్తింపు తెచ్చుకున్న సీనియర్ నటుడు మమ్ముట్టికి కేంద్రం 'పద్మభూషణ్' పురస్కారంతో సత్కరించింది. అదేవిధంగా క్యాన్సర్ నివారణ , వైద్య రంగంలో అంతర్జాతీయంగా ఎనలేని సేవలందించిన ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ నోరి దత్తాత్రేయుడు కూడా 'పద్మభూషణ్' అవార్డును స్వీకరించారు. తెలుగు చలనచిత్ర పరిశ్రమకు ఈ వేడుకలో ప్రత్యేక గౌరవం దక్కింది. సుదీర్ఘ కాలంగా వెండితెరపై నటుడిగా, నిర్మాతగా సేవలందించిన మాజీ ఎంపీ మురళీమోహన్, అలాగే వైవిధ్యభరితమైన పాత్రలతో, హాస్యంతో తెలుగు ప్రేక్షకులను అలరించిన 'నటకిరీటి' ..మిగతా 2లో

# కుల రాజకీయాలను తిప్పికొట్టాలి



క్రిమినల్స్ కు వైసీపీ అండ

పవన్‌ను అనవసర వివాదాల్లోకి లాగుతున్నారు

జూలై 3న కడప స్టీల్ ఫ్యాక్టరీకి శంకుస్థాపన

కేబినెట్ భేటీలో మంత్రులతో సీఎం

(అమరావతి - జయజయహే)

కేబినెట్ సమావేశం అనంతరం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పలు కీలక వ్యాఖ్యలు చేశారు. క్రిమినల్స్‌ను వైసీపీ వెనకేసుకొస్తూ రాజకీయం చేస్తోందన్నారు. వైసీపీ నేతలు కుల మీటింగ్‌లు పెడుతూ కులాల మధ్య చిచ్చు పెట్టే కుట్రల్ని దీటుగా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కర్నూలులో ..మిగతా 2లో




# వాళ్లకి ఓపీఎస్..

2004 కంటే ముందు చేరితే వర్తింపు

11 వేల ప్రభుత్వ ఉద్యోగులకు గుడ్ న్యూస్

కేబినెట్ మీటింగ్ లో కీలక నిర్ణయం

(అమరావతి - జయజయహే)

రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగులకు ప్రభుత్వం అదిరిపోయే శుభవార్త చెప్పింది. రాష్ట్రంలో 2004 కంటే ముందు ఉద్యోగాల్లో చేరిన వారికి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించింది. తాజాగా ..మిగతా 2లో

# పెట్రో ధరలు తగ్గే ఛాన్స్

శాంతి ఒప్పందంతో కీలక పరిణామం

చమురు ధరలు తగ్గుముఖం

దేశంలో కొద్ది నెలల్లో తగ్గుదలకు అవకాశం

(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)

ఇరాన్-ఇజ్రాయెల్-అమెరికా యుద్ధం యావత్ ప్రపంచాన్ని ఇబ్బందుల్లోకి నెట్టేసింది. చమురు సరఫరాకు కీలకమైన హోర్ముజ్ జలసంధి మూతపడడంతో ప్రపంచ మార్కెట్లో ముడి చమురు ధరలు బ్యారెల్‌కు 100 డాలర్ల పైకి చేరి, ఇంధన, వాణిజ్య సంక్షోభం తలెత్తేలా కనిపించింది. కానీ తాజాగా అమెరికా- ఇరాన్ మధ్య జరిగిన శాంతి ఒప్పందంతో చమురు ధరలు మళ్లీ తగ్గుముఖం పట్టాయి. ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెండ్ క్రూడ్ ధర బ్యారెల్‌కు సుమారు ఏ77.39 డాలర్లు వద్ద ట్రేడ్ అవుతుంటే.. డబ్ల్యూటీఐ క్రూడ్ ధర బ్యారెల్‌కు సుమారు ఏ73.57 వద్ద ట్రేడ్ అవుతోంది. అయితే ప్రస్తుతం హోర్ముజ్ జలసంధి తిరిగి తెరుచుకోవడంతో, ..మిగతా 2లో




# ప్రజా సమస్యల పరిష్కారానికే వచ్చా...!

కొద్ది మాసాల్లోనే 22 ఏ భూముల సమస్యలకు పరిష్కారం

ఏపీ శాసనసభ పెటిషన్స్ కమిటీ చైర్మన్ కె. రఘురామ కృష్ణంరాజు



(ప్రత్యేక ప్రతినిధి జయ జయహే)

ప్రజా సమస్యల పరిష్కారానికి రాష్ట్ర శాసనసభ పిటిషన్స్ కమిటీ విశాఖ వచ్చిందని, నిర్వహించిన సమావేశం ఫలప్రదంగా జరిగిందని కమిటీ చైర్మన్ కె. రఘురామకృష్ణంరాజు అన్నారు. మంగళవారం కలెక్టరేట్ మీటింగు హాలులో అధికారులతో సమీక్షించిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. సమావేశంలో చర్చించిన అంశాలు, తీసుకున్న నిర్ణయాల గురించి వివరించారు. కమిటీ సభ్యులు గంటా శ్రీనివాసరావు, ..మిగతా 2లో

# ఏసీ బస్సుల్లోనూ ఫ్రీ బస్

స్త్రీ శక్తి పథకం విస్తరణ

రవాణా మంత్రి రాం ప్రసాద్ వెల్లడి



2



# సీఐ నాగరాజు అరెస్టు

సాయికృష్ణ అదృశ్యం కేసులో సంచలనం

విచారణ చేసిన సిట్ అధికారులు

(విజయవాడ - జయజయహే)

గత నాలుగైదు రోజులుగా తీవ్ర సంచలనంగా మారిన సాయికృష్ణ మిస్సింగ్ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న కృష్ణలంక సస్పెండెడ్ సీఐ నాగరాజును తాజాగా సిట్ ..మిగతా 2లో

# రూ. 34 వేల కోట్ల పెట్టుబడులకు పచ్చజెండా

మొదటి పేజీ తరువాయి...

రంగ సంస్థలు, కార్పొరేషన్లు, ప్రభుత్వ సొసైటీల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు ఏపీ సర్కార్ తీపి కబురు అందించింది. వీరి పదవీ విరమణ వయస్సును 60 సంవత్సరాల నుండి 62 ఏళ్లకు పెంచుతూ తీసుకున్న నిర్ణయానికి క్యాబినెట్ అధికారికంగా ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయంతో వేలాది మంది ఉద్యోగులకు లబ్ధి చేకూరనుంది. ఆంధ్రప్రదేశ్‌ను ప్రముఖ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు మంత్రివర్గం విప్లవాత్మక నిర్ణయాలు తీసుకుంది. రాజధాని అమరావతిలో అంతర్జాతీయ స్థాయి సౌకర్యాలతో కూడిన ఫైవ్ స్టార్ హోటళ్లు, ప్రతిష్టాత్మక కన్వెన్షన్ సెంటర్ల ఏర్పాటును ప్రోత్సహించేందుకు ప్రత్యేక రాయితీలు, ఇన్సెంటివ్‌లు ఇవ్వాలని నిర్ణయించారు. దీనితో పాటు రాష్ట్రంలోని ప్రముఖ



పర్యాటక, ఆధ్యాత్మిక క్షేత్రాలైన టూరిజం ప్రాజెక్టుల అభివృద్ధికి క్యాబినెట్ అంగీకరించింది. విశాఖపట్నం, తిరుపతి, కర్నూలు, అన్నవరం పుణ్యక్షేత్రాలు అభివృద్ధి చేయనుంది. పర్యావరణ పరిరక్షణ, పునరుత్పాదక ఇంధన ఉత్పత్తిలో ఆంధ్రప్రదేశ్‌ను ముందంజలో ఉంచేందుకు రాయలసీమ జిల్లాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. అనంతపురం, వైఎస్సార్ కడప జిల్లాలలో భారీ సౌర, పవన విద్యుత్ ప్రాజెక్టుల స్థాపనకు అవసరమైన భూముల కేటాయింపులకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తూ, కాలుష్య రహిత ఇంధనాన్ని అందించేందుకు వీలుగా రాష్ట్రవ్యాప్తంగా బయోగ్యాస్ ప్లాంట్ల ఏర్పాటుకు ప్రత్యేక ప్రోత్సాహకాలు అందించాలని నిర్ణయించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో జరిగిన ఈ మంత్రివర్గ సమావేశం.. అటు పారిశ్రామిక రంగంలో పెట్టుబడుల వరదకు, ఇటు నిరుద్యోగులకు ఉపాధి కల్పనకు, అలాగే ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ రాష్ట్ర భవిష్యత్తుకు ఒక స్పష్టమైన దిశానిర్దేశం చేసింది.

# కాబోయే భర్తను లోయలేకి తోసేసి..

**ప్రమాదశావత్తు మరణంగా చిత్రీకరణ**

**ప్రియుడుతో కలసి కాబోయే భర్త హత్య**

**పోలీసులు విచారణలో వాస్తవాలు బట్టబయలు**

**(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)**

మహారాష్ట్రకు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త విశాల్ అగర్వాల్ కుమారుడు కేతన్ అగర్వాల్ మర్డర్ కేసులో షాకింగ్ విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. సియా, ఆమె ప్రియుడు చేతన్ చౌదరీలు కలిసే కేతన్‌ను లోయలోకి తోసేసినట్లు పోలీసులు తేల్చారు. ఈ ఘటనపై పోలీసు ఉన్నాతాధికారులు సైతం విచారం వ్యక్తం చేస్తున్నారు. కేతన్ అగర్వాల్‌కు సియా గోయల్ అనే అమ్మాయితో కొన్ని రోజుల క్రితం పెళ్లి నిశ్చయం అయింది. నవంబర్‌లో పెళ్లి జరగాల్సి ఉంది. గురువారం సియా పుట్టిన రోజు వేడుకల్లో భాగంగా సియ, కేతన్ లోనావాలాకు ట్రెక్కింగ్‌కు వెళ్లారు. లోహగడ్ కోటకు వెళుతుండగా కేతన్ లోయలో పడిపోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు, రెస్క్యూ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఫొటోలు దిగుతుండగా ప్రమాదవశాత్తు కేతన్ లోయలో పడిపోయాడని సియా పోలీసులకు చెప్పింది. 3 గంటల రెస్క్యూ ఆపరేషన్ తర్వాత లోయలో కేతన్ శవాన్ని కనుగొన్నారు. పోలీసులు శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. లోనావాలా రూరల్ పోలీసులు సియాను విచారించగా.. ఆమె పొంతన లేని సమాధానాలు చెప్పటం మొదలెట్టింది. దీంతో పోలీసులకు ఆమెపై అనుమానం వచ్చింది. మొబైల్ డేటా, కాల్ రికార్డ్స్ సేకరించటంతో పాటు సంఘటనా స్థలంలో ఉన్న జనాలను విచారించారు. దీంతో ఆమెపై అనుమానం మరింత పెరిగింది. ఈ నేపథ్యంలోనే సియాను, ఆమెను ప్రియుడిని అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా అసలు విషయం బయటపడింది. సియా, ఆమె ప్రియుడు చేతన్ చౌదరీలు పక్కా ప్లాన్‌తో కేతన్‌ను మర్డర్ చేసినట్లు తేలింది. ఇద్దరూ కలిసి కేతన్‌ను లోయలో తోసేశారని వెల్లడైంది. ఈ మర్డర్ ఇద్దరే చేశారా? లేక వారికి ఎవరైనా సహకరించారా? అన్న కోణంలో కూడా పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు.

**హత్యకు కారణం ఇదే..**

పోలీసులు చెబుతున్న దాని ప్రకారం.. కేతన్‌ను పెళ్లి చేసుకోవటం సియాకు ఏమాత్రం ఇష్టం లేదు. ఆమె చేతన్ చౌదరీని ప్రేమిస్తోంది. ఇద్దరూ ఒకే ఆఫీస్‌లో కలిసి పని చేస్తున్నారు. ప్రియుడి సాయంతో కేతన్ అడ్డు తొలగించుకోవాలని ఆమె భావించింది. ఈ నేపథ్యంలోనే ఇద్దరూ పక్కా ప్లాన్ వేసుకున్నారు. సియా తన పుట్టిన రోజున కేతన్‌ను లోహగడ్‌కు ట్రెక్కింగ్‌కు తీసుకెళ్లింది. సరైన సమయం దొరకగానే తన ప్రియుడు చేతన్ సాయంతో కేతన్‌ను లోయలోకి తోసేసింది. కేతన్ ప్రమాదవశాత్తు లోయలో పడిపోయాడని పోలీసులను నమ్మించే ప్రయత్నం చేసింది. దర్యాప్తులో ఆమె చేసిన నేరం బయటపడింది.


**ప్యాలెస్ కోసం రూ. 17 కోట్లు..**

కొడుకు పెళ్లి కోసం విశాల్ అగర్వాల్ ఇప్పటికే 20 కోట్లకు పైగా ఖర్చు చేసినట్లు తెలుస్తోంది. పెళ్లి నవంబర్ నెలలో రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో జరగాల్సి ఉంది. విశాల్ 17 కోట్ల రూపాయలు ఖర్చు పెట్టి పెళ్లి కోసం ఇప్పటికే ప్యాలెస్ బుక్ చేశాడు. అంతేకాదు.. బంధుమిత్రులను, అతిథులను తరలించడానికి విమానాలను కూడా బుక్ చేశాడు. పెళ్లికి ఇంకా ఐదు నెలలు ఉన్నా కూడా ఇప్పటినుంచే రెండు కుటుంబాల వారు పెళ్లి పనులు మొదలెట్టారు. సియా చేసిన దారుణం కారణంగా రెండు కుటుంబాల వారు షాక్‌లో ఉన్నారు.

# పెట్రో ధరలు తగ్గే ఛాన్స్

మొదటి పేజీ తరువాయి...

ప్రపంచవ్యాప్తంగా చమురు నిల్వలు అవసరానికి మించి పెరిగిపోతాయని మార్కెట్లు అంచనా వేస్తున్నాయి. రాబోయే రెండేళ్లలో ప్రపంచ చమురు సరఫరా, డిమాండ్ కంటే చాలా వేగంగా పెరుగుతుందని, తద్వారా 2027 నాటికి చమురు మిగులు ఏర్పడుతుందని అంతర్జాతీయ ఇంధన సంస్థ పేర్కొంది. పశ్చిమ ఆసియాలో జరిగిన యుద్ధం కారణంగా రోజుకు 14 మిలియన్ బ్యారెళ్ల చమురు ఉత్పత్తి నిలిచిపోయిందని ఐఈఏ అంచనా వేసింది. క్రిస్టల్ ఎనర్జీ గ్లోబల్ అడ్వైజర్ క్రిస్టొఫ్ రూహ్లా అభిప్రాయం




ప్రకారం.. 2027 నాటికి ప్రపంచ సరఫరా, డిమాండ్ కంటే రోజుకు 1 మిలియన్ బ్యారెళ్ల కంటే ఎక్కువగా ఉంటుంది. దీనివల్ల ముడి చమురు ధరలు బ్యారెల్‌కు 60 డాలర్ల కంటే కిందకు పడిపోయే అవకాశం ఉంది. దీని ప్రభావంతో భారత్‌లో ఇంధన ధరలు తగ్గే అవకాశం ఉందని గేట్‌వే హౌస్‌లో ఎనర్జీ, ఇన్వెస్ట్‌మెంట్ అండ్ కనెక్టివిటీ సీనియర్ ఫెలో అమిత్ భండారీ తెలిపారు. అయితే ఈ తగ్గదల అనేది తక్షణమే ఉండకోవచ్చని.. దానికి దాదాపు 5-6 నెలల సమయం పడుతుందన్నారు. అంతేకాదు రాబోయే రోజుల్లో ప్రపంచ ఇంధన మార్కెట్లలో భారీ మార్పులు రాబోతున్నాయని నిపుణులు అంటున్నారు. 2027 నాటికి ప్రపంచ చమురు సరఫరా రోజుకు సుమారు 8 మిలియన్ బ్యారెళ్లు పెరుగుతుందని, కానీ డిమాండ్ కేవలం 2 మిలియన్ బ్యారెళ్లు మాత్రమే ఉంటుందని అంచనా వేస్తున్నారు. దీని వల్ల ప్రపంచ మార్కెట్‌లో భారీ ఎత్తున చమురు మిగులు ఏర్పడుతుందని భావిస్తున్నారు. ఇది ప్రపంచ దేశాలకు ఎంతగానో ఉపశమనాన్ని కలిగిస్తోందని.. ఇది ధరలను తగ్గించడమే కాకుండా.. పశ్చిమాసియా సంక్షోభం కారణంగా ఏర్పడి కొరతను ఫుల్‌ఫిల్ చేసుకోవడానికి సహాయపడుతుందన్నారు. అమెరికా-ఇరాన్ ఒప్పందం ఇలాగే కొనసాగితే గల్ఫ్ దేశాల నుండి చమురు ఎగుమతులు క్రమంగా పుంజుకుంటాయని ఐఈఏ భావిస్తోంది. శాశ్వత ఒప్పందం కుదిరి, ఇరాన్ ఎగుమతులపై ఆంక్షలు తొలగిపోతే, మరింత ముడి చమురు అంతర్జాతీయ మార్కెట్లలోకి వస్తుంది. ఇది సరఫరాను మరింత మెరుగుపరిచి, చమురు ధరలపై ఉన్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల ప్రభావాన్ని తగ్గిస్తుందని పేర్కొంది.





# పద్మ పురస్కారాలు ప్రదానం

మొదటి పేజీ తరువాయి...

రాజేంద్రప్రసాద్‌లు రాష్ట్రపతి చేతుల మీదుగా 'పద్మశ్రీ' పురస్కారాలను అందుకున్నారు. వీరితో పాటు బహుముఖ ప్రజ్ఞాశాలి, ప్రముఖ నటుడు ఆర్. మాధవన్‌ను కూడా కేంద్రం పద్మశ్రీతో గౌరవించింది. క్రీడా రంగానికి వస్తే, భారత క్రికెట్ జట్టుకు ఎన్నో అద్భుత విజయాలను అందించి, ప్రపంచ క్రికెట్‌లో తనదైన ముద్ర వేసిన కెప్టెన్ రోహిత్ శర్మ 'పద్మశ్రీ' పురస్కారాన్ని అందుకున్నారు. సమాజ శ్రేయస్సు కోసం, దేశ ప్రగతి కోసం నిరంతరం కృషి చేస్తూ తమ తమ రంగాలలో అత్యున్నత ప్రతిభ కనబరిచిన వీరందరినీ గౌరవించడం ద్వారా పద్మ పురస్కారాల విశిష్టత మరింత పెరిగిందని చెప్పవచ్చు. ఈ కార్యక్రమానికి పలువురు కేంద్ర మంత్రులు, ఉన్నతాధికారులు , ప్రముఖులు హాజరై అవార్డు గ్రహీతలను అభినందించారు

# కుల రాజకీయాలను తిప్పికొట్టాలి

మొదటి పేజీ తరువాయి...

ఇటీవల చోటుచేసుకున్న ఘటనను ప్రస్తావించిన సీఎం, గ్రామస్థులే బహిష్కరించిన వ్యక్తులకు వైసీపీ మద్దతుగా నిలవడం విచారకరమని వ్యాఖ్యానించారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను అనవసర వివాదాల్లోకి లాగేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని, అలాంటి సందర్భాల్లో కూటమి ఐక్యతను చాటే విధంగా మంత్రులంతా స్పందించాలని సూచించారు. ప్రభుత్వ పనితీరును మరింత సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లాలంటే ప్రతి మంత్రి అన్ని శాఖలపై అవగాహన పెంచుకోవాలని అన్నారు. అభివృద్ధి కార్యక్రమాలపై కూడా సీఎం కీలక ప్రకటనలు చేశారు. జొన్నగిరి గ్రామాన్ని 'స్వర్ణ గ్రామం'గా నామకరణం చేయాలని ప్రతిపాదించారు. అలాగే జూలై 3న కడప స్టీల్ ఫ్యాక్టరీకి శంకుస్థాపన చేయనున్నట్లు సీఎం చంద్రబాబు వెల్లడించారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికే వచ్చా...!

మొదటి పేజీ తరువాయి...

విష్ణుకుమార్ రాజు, కొణతాల రామకృష్ణలతో పాటు జరిగిన సమావేశంలో ప్రతి సమస్యకు పరిష్కార మార్గాలను గుర్తించడంతో పాటు, వాటి అమలుకు నిర్దిష్ట కాలపరిమితులను నిర్ణయించామన్నారు. గాజువాక నియోజకవర్గానికి సంబంధించిన దీర్ఘకాలిక సమస్యలపై ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు సమర్పించిన 14 పిటిషన్లను సమావేశంలో సవివరంగా పరిశీలించి, సంబంధిత శాఖల అధికారులతో విస్తృతంగా చర్చించినట్లు పేర్కొన్నారు. సమస్యల పరిష్కారానికి ఎంత సమయం అవసరమో, ఏ శాఖ ఏ విధంగా చర్యలు చేపట్టాలో, అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్వహించాల్సిన బాధ్యతలపై స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. అధికారులు కూడా మానవతా దృక్పథంతో స్పందించి, సమస్యలకు పరిష్కారం కనుగొనే దిశగా సానుకూలంగా వ్యవహరించారని కమిటీ చైర్మన్ తెలిపారు. అధికార పరిమితులు ఉన్నప్పటికీ ప్రజలకు న్యాయం చేయాలనే సంకల్పంతో పనిచేయడం సమావేశ విజయానికి దోహదపడిందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి నిర్దిష్ట గడువులు నిర్ణయించుకోవడం, లక్ష్యాలను నిర్దేశించుకుని ముందుకు సాగడం ద్వారా ప్రజలకు త్వరితగతిన న్యాయం చేయగలమనే విశ్వాసం మరింత బలపడిందన్నారు. ఇదే స్ఫూర్తితో రాష్ట్రవ్యాప్తంగా ప్రజాప్రతినిధులు ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తే మరింత మెరుగైన పాలన అందించే అవకాశం ఉంటుందని అభిప్రాయపడ్డారు.

**- గాజువాక సమస్యలపై కమిటీ సానుకూల స్పందన : ఎమ్మెల్యే పల్లా**

ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ గాజువాకలో ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పిటిషన్స్ కమిటీ దృష్టికి తీసుకువెళ్లిన వెంటనే కమిటీ చైర్మన్ స్పందించి ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కమిటీ సభ్యుల సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు. అధికారులందరూ అన్ని అంశాలపై పూర్తి అవగాహనతో స్పందిస్తూ, కొన్ని సమస్యలను రెండు నెలల బదులు నెల రోజుల్లోనే పరిష్కరించే అవకాశాలను కూడా సూచించారని పేర్కొన్నారు.

సమావేశంలో ప్రధానంగా 22ఏ నిషేధిత భూముల జాబితాకు సంబంధించిన అంశంపై విస్తృతంగా చర్చించినట్లు తెలిపారు. గతంలో కొన్ని సహకార గృహ నిర్మాణ సంఘాలకు విక్రయించిన స్థలాలు చెరువు గర్భ ప్రాంతాలు లేదా నిషేధిత భూముల పరిధిలో ఉన్నాయని గుర్తించి 22ఏ జాబితాలో చేర్చారని, అయితే ప్రస్తుతం అక్కడ పూర్తి స్థాయిలో నిర్మాణాలు జరిగి ప్రజలు నివసిస్తున్న పరిస్థితిని కమిటీ పరిశీలించిందన్నారు. ప్రస్తుత వాస్తవ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని అర్హత ఉన్న ప్రాంతాలను 22ఏ జాబితా నుంచి తొలగించే దిశగా చర్యలు చేపట్టాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. ఈ అంశంపై రాబోయే రెండు నుంచి మూడు నెలల్లో స్పష్టమైన పరిష్కారం లభించే అవకాశముందని ఆశాభావం వ్యక్తం చేశారు. సాధారణ పరిపాలనా స్థాయిలో పరిష్కారం కాని సమస్యలను పిటిషన్స్ కమిటీ దృష్టికి తీసుకువచ్చి, వాటిపై విధానపరమైన నిర్ణయాలు తీసుకునే దిశగా చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

# ఏసీ బస్సుల్లోనూ ఫ్రీ బస్

**స్త్రీ శక్తి పథకం విస్తరణ**

**రవాణా మంత్రి రాం ప్రసాద్ వెల్లడి**

**(అమరావతి - జయజయహే)**

మహిళల కోసం అమలు చేస్తున్న స్త్రీశక్తి పథకాన్ని మరింత విస్తరించేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమవుతోంది. ప్రస్తుతం సాధారణ ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని పొందుతున్న మహిళలకు త్వరలో ఏసీ బస్సుల్లో కూడా ఉచిత ప్రయాణం కల్పించనున్నట్లు రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ప్రకటించారు. ఈ నిర్ణయం అమల్లోకి వస్తే రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది మహిళలకు మరింత సౌకర్యవంతమైన ప్రయాణం అందుబాటులోకి రానుంది. దీనిపై ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉందని మంత్రి తెలిపారు. అమరావతిలో మంత్రి మాట్లాడుతూ, స్త్రీశక్తి పథకం రాష్ట్రంలో విజయవంతంగా కొనసాగుతోందని తెలిపారు. ఇప్పటివరకు ఈ పథకం ద్వారా 73.62 కోట్ల ఉచిత బస్సు ప్రయాణాలు నమోదయ్యాయని వెల్లడించారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలకు మెరుగైన రవాణా సేవలు అందించేందుకు విద్యుత్ ఆధారిత ఏసీ బస్సులను కూడా ప్రవేశపెట్టనున్నట్లు చెప్పారు. అలాగే దివ్యాంగుల కోసం అమలు చేస్తున్న దివ్యాంగ శక్తి పథకానికి కూడా మంచి స్పందన లభిస్తోందని పేర్కొన్నారు. ఇదే సమయంలో రాష్ట్ర కేబినెట్ టూరిస్ట్ బస్సు యజమానులకు ఊరట కలిగించే కీలక నిర్ణయం తీసుకుంది. ఆల్ ఇండియా టూరిస్ట్ పర్మిట్ బస్సులపై విధిస్తున్న త్రైమాసిక పన్నును ప్రతి సీటుకు రూ.4,000 నుంచి రూ.2,500కు తగ్గిస్తూ నిర్ణయం తీసుకుంది. టూరిస్ట్ బస్సు యజమానుల విజ్ఞప్తిపై ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి తెలిపారు. ఈ పన్ను తగ్గింపుతో ఇతర రాష్ట్రాలకు తరలిపోయిన బస్సుల రిజిస్ట్రేషన్లు తిరిగి ఆంధ్రప్రదేశ్‌కు వచ్చే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. దీంతో రాష్ట్ర ఆదాయం పెరగడమే కాకుండా, వాహనాల భద్రత, ఫిట్‌నెస్ పర్యవేక్షణ కూడా మెరుగుపడుతుందని పేర్కొన్నారు. టూరిజం రంగానికి కొత్త ఊపిరి పోసే ఈ నిర్ణయంతో పాటు మహిళలకు ఏసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించే ప్రతిపాదన రాష్ట్ర ప్రజల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఈ నిర్ణయాలకు సహకరించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

# వాళ్లకి ఓపీఎస్..

మొదటి పేజీ తరువాయి...

వెలగపూడి సచివాలయంలో మంత్రులతో జరిగిన కేబినెట్ మీటింగ్‌లో సీఎం చంద్రబాబు ఈ నిర్ణయం తీసుకున్నారు. ప్రభుత్వ తీసుకున్న ఈ నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 11 వేల ఉద్యోగులకు లబ్ధి చేకూరనుంది. రిటైర్మెంట్ సమయంలో ఆర్థిక భరోసా కల్పించేందుకు ప్రభుత్వ తీసుకున్న ఈ నిర్ణయం ద్వారా రాష్ట్రంలోని ప్రతి ఉద్యోగికి సగటున రూ.3 కోట్ల వరకు ప్రయోజనం చేకూరే అవకాశం ఉంది. అలాగే రాష్ట్రంలో కొత్త పెట్టుబడుల స్థాపనకు, నిరుద్యోగులకు ఉపాధి కల్పన ప్రతిపాదనలకు కేబినెట్ ఆమొదం తెలిపింది. రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటు, ఐటీ, పర్యాటకం, రాజధాని అభివృద్ధి, డేటా సెంటర్లు ఏర్పాటు వంటి అనేక ప్రతిపాదనలకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఎస్ ఐ పీ బీ ద్వారా ప్రతిపాదించిన మొత్తం రూ.34 వేల కోట్ల భారీ పెట్టుబడుల స్థాపనకు మంత్రి వర్గం ఆమోదం తెలిపింది. ఈ భారీ ప్రాజెక్టుకు అందుబాటులోకి వస్తే సుమారు 35 వేల మందికి ఉద్యోగ అవకాశాలు వచ్చే అవకాశం ఉంది. క్యాబినెట్ సమావేశం ముగిసిన అనంతరం మంత్రులతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో చోటుచేసుకుంటున్న తాజా రాజకీయ పరిణామాలు, ముఖ్యంగా సాయికృష్ణ వ్యవహారంపై మంత్రులతో చర్చించారు. సాయికృష్ణ కేసులో ప్రభుత్వం చేయాల్సిన ప్రతి చర్య తీసుకుందని ముఖ్యమంత్రి వివరించారు. ఈ అంశంపై మంత్రులు అప్రమత్తంగా ఉండాలని, వాస్తవాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ను అనవసరంగా ఈ వివాదంలోకి లాగుతున్నారన్న సీఎం చంద్రబాబు అన్నారు. ఈ ప్రచారాన్ని మంత్రులంతా ఖండించాలని, కూటమి పార్టీలకు అతీతంగా అందరూ స్పందించాలని సూచించారు. సాయికృష్ణ వ్యవహారంలో ప్రభుత్వం ఇప్పటికే సిట్‌ను ఏర్పాటు చేసి దర్యాప్తు జరుపుతోందని సీఎం అన్నారు. ప్రభుత్వం లక్ష్యం నిష్పక్షపాత దర్యాప్తు మాత్రమేనని, మంత్రులంతా ఇదే విషయాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని సీఎం చంద్రబాబు సూచించారు.

# సీఐ నాగరాజు అరెస్టు

మొదటి పేజీ తరువాయి...


అధికారులు అరెస్ట్ చేశారు. ఉదయం సింగ్‌నగర్‌లో ఉన్న ఆయన నివాసానికి చేరుకున్న సిట్ బృందం నాగరాజును అదుపులోకి తీసుకొని అక్కడి నుంచి తరలించారు. అయితే ఆయన్న అరెస్ట్ చేసే సమయంలో అక్కడ హైటెన్షన్ వాతావరణ చోటు చేసుకుంది. సీఐ నాగరాజును అరెస్టు చేసేందుకు వచ్చిన పోలీసులను నాగరాజు మద్దతుదార్లు, స్థానికులను అడ్డుకున్నారు. ఆయన్న అరెస్ట్ చేయవద్దంటూ ఆందోళనకు దిగారు. నినాదాలు చేస్తూ పోలీసులకు అడ్డుతగిలారు. దీంతో ఆందోళనకారుల్ని చెదరగొట్టిన పోలీసులు నాగరాజు ఇంట్లోకి వెళ్లి ఆయన్ను అదుపులోకి తీసుకున్నారు. అయితే నాగరాజు ఇంటికి స్థానికులు పెద్ద సంఖ్యలో వస్తుండడంతో ముందు జాగ్రత్తగా ఆ ఏరియాలో సెక్యూరిటీని కూడా పెంచారు పోలీసులు. సాయికృష్ణ మిస్సింగ్ కేసులో తల్లి చేసిన కంప్లైంట్ ఆధారంగా ఈకేసులో బీఎన్ ఎస్ యాక్ట్‌లోని సెక్షన్ 103(1), సెక్షన్ 127(4), సెక్షన్ 127(6) సెక్షన్లను నమోదు చేశారు పోలీసులు. దీనిలో మొదటిది సెక్షన్ 103(1) -- అంటే ఇది హత్య కేసు. దీని ఫలితం జీవితఖైదు. ఇక మరో సెక్షన్ 127(4) -- ఒక వ్యక్తిని 10 రోజుల కన్నా ఎక్కువ అక్రమంగా నిర్బంధిస్తే ఈ సెక్షన్‌ను నమోదు చేస్తారు. నేరం రుజువు అయితే.. 5ఏళ్ల జైలుశిక్ష పడుతుంది. ఇక సెక్షన్ 127(6) -- అంటే.. ఎవరినైనా ఎక్కడ బంధించారో బయటికి తెలియకుండా, కుటుంబానికి లేదా పబ్లిక్ సర్వెంట్‌కు తెలియకుండా దాచిపెట్టి నిర్బంధిస్తే ఈ సెక్షన్ వర్తిస్తుంది. దీనికి సాధారణంగా అదనంగా 3 సంవత్సరాల వరకు జైలు ం జరిమానా పడే అవకాశం ఉంటుంది. క్లుప్తంగా.. ఎఫ్ ఐ ఆర్ లో ఈ సెక్షన్లు ఉంటే, ఆరోపణ ఏంటంటే.. ఒక వ్యక్తిని 10 రోజులకు పైగా అక్రమంగా నిర్బంధించి, ఆ విషయం బయటకు తెలియకుండా దాచి ఉంచడమే కాకుండా, చివరకు ఆ వ్యక్తిని హత్య చేశారన్న కోణంలో కేసు నమోదు చేసినట్టు అర్థం. అయితే సాయికృష్ణ మిస్సింగ్ కేసులో మొదట్నుంచి నాగరాజు పాత్రపైన తీవ్ర ఆరోపణలు వచ్చాయి. సాయికృష్ణ తల్లి కూడా అప్పుడు కృష్ణలంక సీఐ గా ఉన్న నాగరాజే తన కొడుకును టార్చర్ చేశారని ఆరోపించారు. కొడుకు ఆచూకీ కోసం ఆమె హెబియస్ కార్పస్ పిటిషన్ వేసి హైకోర్టుకు కూడా వెళ్లారు. వివాదం రోజురోజుకూ పెద్దదవుతూ ఉండడంతో ప్రభుత్వం సిట్ ఏర్పాటు చేసింది. చివరికి ఇప్పుడు సిట్ విచారణలో కొన్ని కీలక వివరాలు బయటకు రావడంతో నాగరాజును అరెస్టు చేసి తీసుకెళ్లారు సిట్ అధికారులు.

# ఆక్రమణలపై నగరపాలక సంస్థ కఠిన చర్యలు


**రాజమహేంద్రవరం, జయజయహే బ్యూరో:**

నగరపాలక సంస్థ పరిధిలో రహదారులు, కాలువలు, ఫుట్‌పాత్‌లు మరియు ప్రభుత్వ స్థలాలను ఆక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని నగరపాలక సంస్థ కమిషనర్ రాహుల్ మీనా హెచ్చరించారు. ప్రజలకు ఉపయోగపడే ప్రజా స్థలాలను స్వచ్ఛందంగా ఖాళీ చేయాలని, లేకపోతే ప్రత్యేక డ్రైవ్‌ల ద్వారా ఆక్రమణలను తొలగిస్తామని ఆయన స్పష్టం చేశారు.సరస్వతి ఘాట్ ప్రాంతంలో ఫుట్‌పాత్‌ను ఆక్రమించి వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తున్నారనే ఫిర్యాదుల మేరకు మంగళవారం నగరపాలక సంస్థ అధికారులు ఆక్రమణల తొలగింపు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరవ్యాప్తంగా అన్ని ప్రధాన ప్రాంతాల్లో ప్రత్యేక తనిఖీలు నిర్వహించి ఆక్రమణలను గుర్తించి తొలగిస్తామని తెలిపారు. తొలగించిన తర్వాత మళ్లీ ఆక్రమణలు జరగకుండా నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తామని చెప్పారు. ప్రత్యేకంగా రహదారులపై నిర్మాణాలు చేపట్టడం, ఫుట్‌పాత్‌లను ఆక్రమించడం వల్ల ప్రజల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోందని





పేర్కొన్నారు. ప్రజా ప్రయోజనాలకు విఘాతం కలిగించే ఇటువంటి నిర్మాణాలను ఉపేక్షించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. వీధి వ్యాపారులు తోపుడుబండ్లు లేదా ఇతర వాహనాలపై వ్యాపారం నిర్వహించి, సాయంత్రం అనంతరం వాటిని తొలగించుకోవాలని సూచించారు. ఒకే ప్రాంతంలో శాశ్వతంగా రోడ్లు, ఫుట్‌పాత్‌లు ఆక్రమించి వ్యాపారాలు నిర్వహించడాన్ని సహించబోమని హెచ్చరించారు. ప్రజా ఆస్తుల పరిరక్షణ, పౌర మౌలిక సదుపాయాల సంరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత అని కమిషనర్ పేర్కొన్నారు. నగర అభివృద్ధి, ట్రాఫిక్ సౌలభ్యం, ప్రజల భద్రత దృష్ట్యా చేపడుతున్న ఆక్రమణల తొలగింపు చర్యలకు ప్రజలు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. నగరాన్ని పరిశుభ్రంగా, సక్రమంగా తీర్చిదిద్దేందుకు నగరపాలక సంస్థ కట్టుబడి ఉందని రాహుల్ మీనా తెలిపారు.



## ఈనెల 25న మరీడిమాంబ పండగ

**మాడుగుల జూన్ 23 జయ జయహే**

మాడుగుల గ్రామంలో కండి వరం రహదారిలో వేంచేసి ఉన్న శ్రీ మరిడిమాంబ అమ్మవారి జాతర మహోత్సవము ఈ నెల 25న నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి మంగళవారం కొలువు ఏర్పాటు చేశారు. గురువారం అమ్మవారి జాతర ఏర్పాటుకు అని ఏర్పాట్లు పూర్తి చేశారు. మోదమాంబ అలయ కమిటీ ఆధ్వర్యంలో ఈ జాతర నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది గౌరవించడం గల సంతకం పట్టును అభివృద్ధి చేశారు. ఈ రెండు రోజులపాటు శతకం పట్టు వద్ద వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ జాతరను విజయవంతం చేయాలని ఆలయ కమిటీ విజ్ఞప్తి చేసింది. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయం నుంచి శతకంపట్టి వరకు ఘటాలతో ఊరేగింపు నిర్వహించి శతకం పట్టులో ఘటాలను తొలగించారు. మూడు రోజులు పాటు భక్తులు అమ్మవారిని ఇక్కడే దర్శించుకుంటారు. ఈ కార్యక్రమంలో మోదమాంబ ఆలయ కమిటీ అధ్యక్షుడు పుప్పాల అప్పలరాజు, కమిటీ సభ్యులు ఎస్ శ్రీనివాసరావు, బీహెచ్ పైడయ్య నాయుడు, పి బలరాం మాజీ సర్పంచ్ ఎడ్ల కళావతి, బి మోది నాయుడు తదితరులు పాల్గొన్నారు



## ఘనంగా శ్యాం ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి వేడుకలు

**మాడుగుల, జూన్ 23, జయ జయహే**

జన సంఘం వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ 72వ వర్ధంతి వేడుకలు మంగళవారం సాయంత్రం మాడుగుల లో ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా బిజెపి కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకుడు పుట్ట గంగయ్య శ్యాం ప్రసాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను కొనియాడుతూ వివరించారు. ఈ కార్యక్రమంలో మండల బిజెపి అధ్యక్షుడు మెల్లిపాక స్వామి, పార్టీ నాయకులు ధర్మిశెట్టి నారాయణరావు, శ్రీనాథ్ ప్రసాద్ రావు, కూడా వెంకటేశ్వరరావు, కర్రి రాజు, మండల వాసు, సన్యాసినాయుడు, పి లక్ష్మీ రావు, బి బాబురావు, వరహాల నాయుడు, నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు



## తురకలపూడి నర్సరీలో సీడ్స్ బాల్స్ తయారీ

**బుచ్చయ్యపేట జయ జయహే**

తురకలపూడిలో నర్సరీలో సీడ్స్ బాల్స్ తయారీని మంగళవారం చోడవరం సోషల్ ఫారెస్ట్ రేంజర్ కే. జగదీశ్వర్ రావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చోడవరం రేంజ్ పరిధిలో నర్సరీలో రెండు లక్షల సీడ్స్ బాల్స్ తయారీ లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు. ఇప్పటికే 1.80 వేలు బాల్స్ తయారు చేశామని మిగిలినవి పూర్తి చేస్తామని అన్నారు. సీడ్స్ బాల్స్ తయారీలో కానుగా, మహాగని, నేరేడు, తెల్లమద్ది, నల్లమద్ది,చింత, సీతాఫలం, సింధుగా వంటి విత్తనాలు తయారీ చేస్తున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వి. అర్జున తదితరులు పాల్గొన్నారు.



## రాజం హైస్కూల్లో ఆశాజనకంగా ప్రవేశాలు

**బుచ్చయ్యపేట జయ జయహే**

రాజాం జడ్పీ హైస్కూల్లో ఈ సంవత్సరం ప్రవేశాలు ఆశాజనకంగా ఉన్నాయని ప్రధానోపాధ్యాయులు దొడ్డి అప్పారావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంఈఓ ఆదేశాలతో గ్రామ పెద్దలు సహాయ సహకారాలతో గ్రామంలో విద్యార్థుల తల్లిదండ్రుల వద్దకు ఉపాధ్యాయ సిబ్బంది వెళ్లి ప్రభుత్వ బడులు సాధిస్తున్న విజయాలపై పిల్లల తల్లిదండ్రులు అవగాహన కల్పించడంతో ఈ విద్యా సంవత్సరం 80 మంది విద్యార్థులు ప్రవేశాలు జరిగాయని తెలిపారు. వీరిలో 58 మంది వివిధ ప్రైవేట్ పాఠశాల నుంచి వచ్చిన విద్యార్థులు ఉన్నారని తెలిపారు కొత్తగా ప్రవేశాలు పొందిన విద్యార్థులకు ఉపాధ్యాయులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు సత్యప్రసాద్, వెంకట్రావు ,మూర్తి అప్పలనాయుడు, పిల్లల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



## విజయవంతమైన ఉచిత నేత్ర వైద్య శిబిరం

**మాడుగుల జూన్ 23 జయ జయహే**

మాడుగుల మండలం కేజే పురం గ్రామంలో మంగళవారం శంకర్ ఫౌండేషన్ సహకారంతో నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరం విజయవంతమైనది.స్వర్గీయ ఎంపీటీసీ బీసెట్టి శ్రీనివాసరావు జ్ఞాపకార్థం వారి భార్య బిసెట్టి విజయలక్ష్మి కుటుంబ సభ్యులు నిర్వహించిన ఈ శిబిరంలో 100 మంది నేత్ర రోగులు పరీక్షలు నిర్వహించుకోగా వారిలో 30 మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేసి శంకర్ ఫౌండేషన్ ఆసుపత్రికి తరలించారు. మిగిలిన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో శంకర్ ఫౌండేషన్ నేత్ర వైద్యురాలు డాక్టర్ చందన వారి సిబ్బంది క్యాంపు కోఆర్డినేటర్ సతీష్ స్థానిక ప్రతినిధులు పాల్గొన్నారు.

## జన సేనాని ఎక్కడి నుంచైనా పోటీ చేస్తారు

### జగన్ పులివెందుల వదిలి పోటీ చేయగలరా..!

### 11 సీట్లను 1కి తెచ్చుకోకండి.. దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

**విశాఖపట్నం, జూన్ 23, జయ జయహే :**



పవన్ కళ్యాణ్ రాష్ట్రంలో ఎక్కడి నుంచైనా పోటీ చేసే దమ్ము ఉన్న నాయకుడని, జగన్‌కు పులివెందుల కాకుండా మరో నియోజకవర్గం నుంచి పోటీ చేసే ధైర్యం ఉందా అని విశాఖ దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ సవాల్ విసిరారు. విశాఖలోని జన సేన పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్ రెడ్డిని ఉద్దేశించి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఇప్పుడున్న 11 సీట్లను ఒక సీటు చేసుకోవద్దని సూచించారు. వైసీపీ నాయకులు ప్రజా సమస్యలపై దృష్టి సారించాలని, రాజకీయ బురదజల్లే సంస్కృతిని విడనాడాలన్నారు. పవన్ కళ్యాణ్‌ను కులం, మతంతో ముడిపెట్టి రాజకీయ లబ్ధి పొందాలని కొందరు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. అన్ని వర్గాల ప్రజల మద్దతుతోనే రాజకీయ విజయాలు సాధ్యమవుతాయని, కుల రాజకీయాలతో ఎవరూ ఎదగలేరని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, రాష్ట్రంలోకి వస్తున్న పెట్టుబడులను చూసి ప్రతిపక్షాలు అసత్య ప్రచారాలకు దిగుతున్నాయని ఆరోపించారు. అలాగే విశాఖను అంతర్జాతీయ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో బీచ్ షాక్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విశాఖపట్నం విమానాశ్రయాన్ని విజయనగరం జిల్లాకు తరలించే అంశంపై మాట్లాడుతూ భోగాపురం ఎయిర్‌పోర్టు విశాఖదేనని చెప్పారు. తాను భోగాపురం ఎయిర్‌పోర్టుకే ఓటేస్తానని విలేకరులు అడిగిన ప్రశ్నలకు సమాధానమిచ్చారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌పై వైసీపీ నాయకులు చేస్తున్న విమర్శలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రజల కోసం పనిచేసే నాయకుడని, ఆయనపై వ్యక్తిగత విమర్శలు చేయడం మానుకోవాలని సూచించారు. గతంలో అతిగా మాట్లాడిన నాయకులు రాజకీయంగా కనుమరుగైపోయారని వ్యాఖ్యానించారు. విశాఖతో పాటు ఉత్తరాంధ్ర ప్రాంతం వేగంగా అభివృద్ధి చెందుతోందని, కొత్త పరిశ్రమలు, పెట్టుబడులు రాష్ట్రానికి వస్తున్నాయని తెలిపారు.



## 30న చలో విజయవాడ జయప్రదం చేయండి

**చోడవరం జూన్ 23 జయ జయహే**

ఈనెల 30న నిర్వహించనున్న చలో విజవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రైతు సంఘం పిలుపునిచ్చింది. మంగళవారం చోడవరం కోటవీధిలో రైతు సంఘం అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డిపల్లి అప్పలరాజు ఆధ్వర్యంలో రైతులతో సమావేశం నిర్వహించి కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 30న చలో విజయవాడ కార్యక్రమానికి రైతులందరూ రావాలని కోరారు.ఆంధ్ర రాష్ట్రంలో రైతులకు రెండు లక్షల రూపాయలు రుణమాఫీ చేయాలని, రైతులు ఖరీఫ్ సీజన్ కు వడ్డీ లేని రుణాలు ఇవ్వాలని, ఎరువులు పురుగు మందులు నకిలీవి అమ్ముతున్న వ్యాపారుల పైన చర్యలు చేపట్టాలని, రైతు భరోసా రైతులకు, కౌలు రైతులకు, కింద 50 వేల రూపాయలు ఇవ్వాలని, 50 సంవత్సరాలు దాటిన ప్రతి రైతుకు పదివేల రూపాయలు పెన్షన్ ఇవ్వాలని చోడవరం షుగర్ ఫ్యాక్టరీ చెరుకు రైతులకు 30 కోట్ల రూపాయలు బకాయిలు చెల్లించాలని అనకాపల్లి జిల్లాలో ఉన్న షుగర్ ఫ్యాక్టరీలని తెరవాలని, రైతులకు పండించిన పంటతో గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. పెండింగ్ ప్రాజెక్టులో కాలువ లు వెంటనే చేపట్టాలని మరమ్మతులు చేయాలని, సుజుల స్రవంతి ప్రాజెక్టును వెంటనే ప్రారంభించాలని, డిమాండ్లు తో రాష్ట్ర వ్యాప్తంగా 30వ తేదీన విజయవాడలోని ధర్నా చౌక్ వద్ద ధర్నా కార్యక్రమం చేపట్టడం జరుగుతోందన్నారు. అనకాపల్లి జిల్లాలో ఉన్న రైతులు చెరుకు రైతులు అందరూ చలో విజయవాడ రావాలన్నారు. ఈ కార్యక్రమంలో బొబ్బిలి శంకర్రావు, పరమేశ్వర రావు ఉగ్గిని శివకుమార్. సబ్బవరం గణేష్, దుర్గారావు, నాగేశ్వరరావు రైతులు పాల్గొన్నారు.



## శక్తి యాప్‌పై అవగాహన కల్పించిన ఏఎస్ఐ గంగాధర్

**నిడదవోలు జయ జయహే ప్రతినిధి :**

తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్ ఆదేశాల మేరకు, కొవ్వూరు డీఎస్పీ దేవకుమార్ ఆధ్వర్యంలో, నిడదవోలు సీఐ తిలక్ పర్యవేక్షణలో కొవ్వూరు జోన్ నిడదవోలు సర్కిల్ శక్తి టీమ్ ఆధ్వర్యంలో తిమ్మరాజుపాలెం శ్రీ కోట సత్తెమ్మ తల్లి ఆలయం వద్ద అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ గంగాధర్, మహిళా పోలీసు కానిస్టేబుల్ శాంతి పాల్గొని సుమారు 60 మంది ప్రజలకు శక్తి యాప్ ప్రయోజనాలు, ప్రాముఖ్యత గురించి వివరించారు. మహిళల భద్రత, చిన్నారుల రక్షణ కోసం శక్తి యాప్ ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు.అలాగే సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఓటీపీలు, ఆధార్ వివరాలు, అనుమానాస్పద ( ఏపీకే ) లింకులు, ఫోటో మార్ఫింగ్, ఆన్‌లైన్ లోన్ మోసాల వంటి సైబర్ నేరాల గురించి అవగాహన కల్పించారు. ప్రయాణాల సమయంలో విలువైన ఆభరణాలు, నగదు, ముఖ్యమైన వస్తువులను బ్యాగుల్లో భద్రంగా ఉంచుకోవాలని, చిన్న పిల్లలను ఒంటరిగా వదిలి పెట్టకూడదని సూచించారు.మహిళలు ఒంటరిగా ప్రయాణించే సమయంలో అత్యవసర పరిస్థితుల్లో శక్తి యాప్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని వివరించారు. గంజాయి, మత్తు పదార్థాల విక్రయం లేదా వినియోగం గురించి సమాచారం తెలిసినట్లయితే భయపడకుండా పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఈ అవగాహన కార్యక్రమానికి దేవస్థానం సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, ఆలయ సిబ్బంది సహకరించారు.



## నిడదవోలు ఆర్టీసీ డిపోకు పూర్వ వైభవం తీసుకురావాలి: రంగా రమేష్

**నిడదవోలు జయ జయహే ప్రతినిధి :**

నిడదవోలు ఆర్టీసీ డిపోకు పూర్వ వైభవం తీసుకురావడంతో పాటు బస్సు సర్వీసులను పెంచి ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని జనసేన పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు నిడదవోలు ఆర్టీసీ డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా జనసేన పట్టణ అధ్యక్షుడు రంగా రమేష్ మాట్లాడుతూ, నిడదవోలు ఆర్టీసీ డిపో అభివృద్ధికి అవసరమైన సహాయ సహకారాలు రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్, కూటమి నాయకులు శేషారావుతో పాటు ప్రజల నుంచి కూడా లభిస్తాయని తెలిపారు.ఇటీవల నిడదవోలులో జరిగిన సభలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్వయంగా డిపో పరిస్థితులపై వివరాలు అడిగి తెలుసుకున్నారని, డిపో అభివృద్ధికి తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారని గుర్తు చేశారు. అందువల్ల అధికారులు వెంటనే స్పందించి నిడదవోలు ఆర్టీసీ డిపో అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు.ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా కొత్త బస్సు సర్వీసులు ఏర్పాటు చేయడం, నిలిపివేసిన సర్వీసులను పునరుద్ధరించడం, ప్రయాణికులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడం ద్వారా డిపోకు పూర్వ వైభవం తీసుకురావాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ సభ్యులు, జనసేన పార్టీ నాయకులు, జనసైనికులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## మృతుల కుటుంబానికి
# ఆర్థిక సాయం అందజేత

### మాజీ సీఎం జగన్ మాటిచ్చి నెరవేర్చారన్న ఎమ్మెల్యే మత్స్య లింగం

**అరకులోయ, జూన్ 23, జయ జయహే:**

రెండు మాసాల క్రితం జంభువలస గ్రామ పరిధిలోని మలగుమ్మి జలపాలం వద్ద జరిగిన దుర్ఘటనలో ముగ్గురు యువతులు మృతి చెందారు. ఈ విషయాన్ని అరుకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డికి తీసుకెళ్లి బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. దీనిపై తీవ్రంగా స్పందించిన జగన్ మోహన్ రెడ్డి ఆ మేరకు ఆర్థిక సాయం మొత్తాన్ని చెక్కుల రూపంలో పంపించారు. ఆ నగదు చెక్‌లను మృతులు త్రిష, రత్నకుమారి, పవిత్ర కుటుంబ సభ్యులకు అందజేశారు. ఒక్కో బాధిత కుటుంబానికి రూ. 50 వేల చొప్పున ఈ చెక్కులను ఎమ్మెల్యే అందించారు. ఈ సందర్భంగా అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం మాట్లాడుతూ.ఆ ముగ్గురు ఆడబిడ్డల మృతి అత్యంత బాధాకరమని,వారిని మరల తీసుకురాలేము కానీ మానవత దృక్పథంతో స్పందించి రూ. 1.50 లక్షలు ఆర్థిక సహాయం అందించిన మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసీపీ యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రేగం చాణక్య, వైసీపీ అల్లూరి సీతారామరాజు జిల్లా ఉపాధ్యక్షులు బత్తిరి రవిప్రసాద్, వైసీపీ అల్లూరి సీతారామరాజు జిల్లా మహిళా అధ్యక్షురాలు సమిడ వెంకట్ పూర్ణిమ, వైసీపీ అరకు నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షులు రేగం శివరామకృష్ణ, వైసీపీ హుకుంపేట మండల పార్టీ అధ్యక్షులు అనిల్, బూర్జ ఎంపీటీసీ సభ్యులు మజ్జి హరి, సుకూరు గ్రామ పంచాయతీ ఎంపీటీసీ కిలగడ సింహాచలం, గత్తుము సర్పంచ్ పాడి పోతురాజు, మండల ఉపాధ్యక్షులు కాకరి వెంకటరావు , కొంతిలి గ్రామ పంచాయతీ సర్పంచ్ రేగం రమేష్ , వైసీపీ అరకు వ్యాలీ మండలం ఎస్టి సెల్ అధ్యక్షుడు పాంగి నగేష్ , వైసీపీ పట్టం గ్రామ పంచాయతీ అధ్యక్షులు పోతురాజు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలలు, అంగన్‌వాడీలకు నిరంతర నీటి సరఫరా

### స్వచ్ఛ భారత్ మిషన్ లక్ష్యాలపై కీలక సూచనలు

**జయ జయహే:**

పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు నిరంతర నీటి సరఫరా ఉండాలని మంత్రి సీతక్క అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. స్వచ్ఛ భారత్ మిషన్ లక్ష్యాల సాధనపై అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. వర్షాకాలంలో తాగునీటి సరఫరాపై మిషన్ భగీరథ అధికారులకు సూచనలు చేశారు. గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖలపై మంత్రి సీతక్క రాష్ట్రస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. మంగళవారం జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌లో జిల్లా అదనపు కలెక్టర్లు, జడ్పీ సీఈవోలు, డీఆర్‌డీఓలు, డీపీఓలతో మంత్రి సమావేశమయ్యారు. అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల పురోగతిపై జిల్లాల వారీగా సమీక్ష చేశారు. ఉపాధి హామీ పథకం అమలు, కూలీలకు పనిదినాల కల్పన, పెండింగ్ మెటీరియల్ బిల్లుల చెల్లింపులపై ప్రత్యేక దృష్టి సారించారు. అంగన్‌వాడీ భవనాలు, మహిళా శక్తి భవనాలు, జీపీ కార్యాలయాల నిర్మాణాలపై సమీక్షించారు. జల సంరక్షణ పనులు, చెక్‌డ్యాంల నిర్మాణాలపై అధికారులతో మంత్రి చర్చలు జరిపారు. ప్రధానమంత్రి కృషి సించాయీ యోజన(పీఎమ్‌కేఎస్‌వై) పనుల అమలుపై మంత్రి సమీక్ష జరిపారు. గ్రామపంచాయతీల పనితీరు, గ్రామ కార్యదర్శుల హాజరుపై సీతక్క ఆరా తీశారు. పారిశుద్ధ్య నిర్వహణ, ఇంటి పన్నుల వసూళ్ల పురోగతిపై చర్చించారు.

# యూరియా యాప్‌ను ఎత్తేయాలన్న వేముల

### రైతు ధర్నాకు వెళ్లకుండా అడ్డుకున్న పోలీసులు... వేముల ప్రశాంత్ రెడ్డి హౌస్ అరెస్టు

### సకాలంలో యూరియా సరఫరా చేయాలని డిమాండ్

**జయ జయహే:**

మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. మంగళవారం ఉదయం హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని ఆయన నివాసానికి వెళ్లిన పోలీసులు నిర్బంధించారు. యూరియా యాప్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ నిజామాబాద్ జిల్లా తాడ్వాయి మండలంలో ఎల్లారెడ్డి నియోజకవర్గ బీఆర్ఎస్ ఇంచార్జి జాజాల సురేందర్ ఆధ్వర్యంలో వేలాది మంది రైతులు ధర్నా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ ధర్నాలో పాల్గొనేందుకు వేముల ప్రశాంత్ రెడ్డి బయల్దేరగా.. ముందస్తు చర్యల్లో భాగంగా ఆయన్ను పోలీసులు ఇంటి వద్దే నిలువరించారు. రైతులు యూరియా యాప్ వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, సకాలంలో యూరియా దొరకడం లేదనే బాధతో నిరసన కార్యక్రమం చేపట్టారని బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి తెలిపారు. రైతుల పిలుపు మేరకు, ఎల్లారెడ్డి నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ సురేందర్ నాయకత్వంలో తామంతా అక్కడికి బయల్దేరాలని నిర్ణయించుకున్నామని, అయితే తనను హైదరాబాద్‌లోనే హౌస్ అరెస్ట్ చేయడం చాలా దుర్మార్గమని ఎమ్మెల్యే వేముల మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటువంటి నియంతృత్వ పాలనతో సాధించేదేమీ ఉండదని ఎమ్మెల్యే వేముల హితవు పలికారు. 'మమ్మల్ని అరెస్ట్ చేసి మా గొంతు నొక్కే బదులు, అక్కడ రైతులకు ఇబ్బందిగా మారిన యూరియా యాప్‌ను వెంటనే రద్దు చేయాలి అని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గతంలో కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు అన్-సీజన్‌లోనే దేశంలో ఎక్కడ యూరియా దొరికినా కొనుగోలు చేసి గోదాముల్లో నిల్వ ఉంచేవారు. రైతులు ఆటో వానికి పైసలు ఇచ్చి పంపిస్తే, నేరుగా పొలాల వద్దకే యూరియా సంచులు వచ్చే పరిస్థితి ఉండేదని , అందుకే రైతన్నలకు ఎలాంటి కొరత లేకుండా యూరియా దొరికిందని గుర్తుచేశారు. ఆ తెలివి ప్రస్తుత ముఖ్యమంత్రికి లేదన్నారు. రైతులకు సరిపడా యూరియాను విరివిగా అందుబాటులో ఉంచాలని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టి అంతా హైదరాబాద్‌లో భూములు ఎక్కడున్నాయి. వాటిని ఏం చేయాలనే దానిపైనే ఉంది తప్ప, రైతుల బాధలపై లేదని ఎమ్మెల్యే వేముల విమర్శించారు. నిన్న మొన్నటి దాకా వడ్ల కొనుగోలు కోసం రైతులను ఏడు చెరువుల నీళ్లు తాగించారని, ఇప్పుడు యూరియా కోసం ఇబ్బందులు పెడుతున్నారని ఆరోపించారు. రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడానికి నిరసన తెలుపుతామంటే, ఎల్లారెడ్డి నియోజకవర్గంలో దాదాపు 300 మంది బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలను పొద్దున నుంచి అరెస్ట్ చేసి పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నియోజకవర్గ ఇంచార్జ్ సురేందర్ , తాడ్వాయి మండల కేంద్రంలో డీసీఎంఎస్ డైరెక్టర్ కపిల్ రెడ్డిలను అరెస్ట్ చేయడానికి ప్రయత్నిస్తున్నారని, రోడ్ల మీదికి వస్తున్న రైతులను సైతం వదలకుండా అరెస్ట్ చేస్తున్నారని తెలిపారు. కామారెడ్డి పట్టణంలో బాన్సువాడలో కూడా బీఆర్ఎస్ నాయకులను, కార్యకర్తలను అదుపులోకి తీసుకున్నారన్నారు. ప్రజా పాలన తెస్తామన్న రేవంత్ రెడ్డి ఇవాళ నియంతృత్వ పాలన సాగిస్తున్నారు. అరెస్టులతో మా గొంతు నొక్కే బదులు యూరియా యాప్ రద్దు చేసి సరిపడా యూరియా రేవంత్ రెడ్డి. రేవంత్ రెడ్డిది ప్రజా పాలనా లేక నియంత పాలనా అనేది తెలంగాణ సమాజం, ప్రజా సంఘాలు ఆలోచించాలి. ఎక్కడో కామారెడ్డి జిల్లాలో నిరసన ఉంటే హైదరాబాద్‌లో మమ్మల్ని అరెస్ట్ చేయడం ఈ ప్రభుత్వం ఎంత నియంతృత్వంగా పనిచేస్తుందో చెప్తోంది. మమ్మల్ని అరెస్ట్ చేసినా రైతుల్లో వచ్చే తిరుగుబాటును మాత్రం ఆపలేరు. రైతులు తప్పకుండా బుద్ధి చెప్తారు'అని ఎమ్మెల్యే వేములహెచ్చరించారు. ఢిల్లీకి 72 సార్లు వెళ్లిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మెట్రో రైలు పైన సమావేశాలు పెట్టడానికి సమయం ఉంటుంది కానీ, కేంద్ర ప్రభుత్వాన్ని యూరియా గురించి అడిగే శ్రద్ధ లేదన్నారు. రేవంత్ రెడ్డికి రైతులంటే చాలా చులకన భావం ఉందని విమర్శించారు. అటు కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం కూడా రాష్ట్రానికి రావాల్సిన యూరియాను ఒకేసారి ఇవ్వకుండా కోతలు విధిస్తోందని, ఇటు రేవంత్ రెడ్డికి కేంద్రం నుండి తెచ్చుకునే తెలివి లేదని దుయ్యబట్టారు. ప్రతిపక్షాలుగా తాము రైతుల బాధలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తుంటే వినే ఓపిక లేకపోగా, రివర్స్‌లో అరెస్టులు చేస్తున్నారని మండిపడ్డారు. అటు నరేంద్ర మోదీ, ఇటు రేవంత్ రెడ్డి.. ఈ రెండు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యూరియా విషయంలో, వడ్ల కొనుగోలు విషయంలో తెలంగాణ రైతాంగాన్ని నట్టేట ముంచుతున్నాయని ప్రశాంత్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.





# మీ పుట్టిన తేది తెలుసా?

## పరిహారం తెలుసుకోండి!

**(పుట్టా శ్రీనివాసరావు)**

**పర్సులో కొన్ని ప్రత్యేకమైన, శక్తివంతమైన వస్తువులను ఉంచుకోవడం ద్వారా సంపద, సమృద్ధి, కెరీర్ విజయం, విలాసవంతమైన జీవితం ఐశ్వర్యానికి సంబంధించిన సానుకూల శక్తిని పెంపొందించుకోవచ్చు. వాటి వివరాలు తెలుసుకుందాం.**

పుట్టిన తేదీలు 1, 10, 19, 28
పరిహారం: మీ పర్సు లో ఒక రాగి తీగను ఉంచుకోండి.
లాభం: ఇది ఆత్మవిశ్వాసాన్ని, నాయకత్వ లక్షణాలను, కీర్తిని మరియు ఆర్థిక అధికారాన్ని అందిస్తుంది.

పుట్టిన తేదీలు --- 2, 11, 20, 29
పరిహారం: ఒక వెండి నాణెం ఉంచుకోండి.
లాభం: మానసిక ప్రశాంతతను, స్థిరమైన ఆదాయాన్ని మరియు ఆర్థిక సమతుల్యతను ఇస్తుంది.

పుట్టిన తేదీలు --- 3, 12, 21, 30
పరిహారం: కొద్దిగా కుంకుమపువ్వు ఉంచుకోండి.
లాభం: గురు గ్రహ అనుగ్రహాన్ని క్రియాశీలం చేసి, ఐశ్వర్యాన్ని, కెరీర్ ఎదుగుదలను కలిగిస్తుంది.

పుట్టిన తేదీలు 4, 13, 22, 31
పరిహారం: ఏదైనా విదేశీ కరెన్సీ (నోటు లేదా నాణెం) ఉంచుకోండి.




లాభం: రాహువు యొక్క శక్తిని ఆకర్షించి, విదేశీ అవకాశాలను అకస్మాత్తుగా వచ్చే ధనలాభాలను చేకూరుస్తుంది.

పుట్టిన తేదీలు 5, 14, 23
పరిహారం: ఒక యాలకులు ఉంచుకోండి.
లాభం: వ్యాపారంలో అదృష్టాన్ని, చక్కటి కమ్యూనికేషన్ స్కిల్స్‌ను మరియు ధన ప్రవాహాన్ని మెరుగుపరుస్తుంది.

పుట్టిన తేదీలు 6, 15, 24
పరిహారం: కొద్దిగా తెల్ల చందనం ఉంచుకోండి.
లాభం: శుక్రుడి అనుగ్రహాన్ని అందించి, విలాసవంతమైన జీవితాన్ని మరియు సంపదను ఆకర్షిస్తుంది.

పుట్టిన తేదీలు --- 7, 16, 25
పరిహారం: ఒక లవంగం ఉంచుకోండి.
లాభం: ప్రతికూల శక్తుల నుండి రక్షణ ఇస్తుంది మరియు ఆధ్యాత్మిక అదృష్టాన్ని పెంచుతుంది.

పుట్టిన తేదీలు --- 8, 17, 26

పరిహారం: ఒక చిన్న ఇనుప ఉంగరం లేదా ఇనుప గోళం ఉంచుకోండి.
లాభం: ఆర్థిక ఇబ్బందులను తగ్గించి, శని దేవుని అనుగ్రహాన్ని బలపరుస్తుంది.

పుట్టిన తేదీలు --- 9, 18, 27

పరిహారం: కొద్దిగా నారింజ రంగు సింధూరం ఉంచుకోండి.
లాభం: ధైర్యాన్ని, ఆత్మవిశ్వాసాన్ని విజయానికి కావలసిన శక్తిని పెంపొందిస్తుంది.
పూర్తి నమ్మకం, సానుకూల దృక్పథం స్థిరత్వంతో చేసే చిన్న చిన్న పరిహారాలు మీ జీవితంలో శక్తివంతమైన మార్పులను తీసుకురాగలవు.
గమనిక: పరిహారాలు మీ శక్తిని పెంచడానికి తోడ్పడతాయి, కానీ నిజమైన సంపదను సృష్టించడానికి కష్టపడే తత్వం, క్రమశిక్షణ సరైన నిర్ణయాలు కూడా అంతే ముఖ్యం.




# ప్రయాణీకుల భద్రతే ప్రథమ ప్రాధాన్యత

### దక్షిణ తీర రైల్వే జీఎం సందీప్ మాథుర్

### జోన్ వ్యాప్తంగా భద్రతా సన్నద్ధతపై సమీక్ష

**విశాఖపట్నం, జూన్ 23, జయ జయహే**

రైల్వేకి భద్రతే అత్యంత ప్రాధాన్యత అని దక్షిణ కోస్తా రైల్వే జనరల్ మేనేజర్ సందీప్ మాథుర్ అన్నారు. జోన్‌లోని నాలుగు డివిజన్ల ప్రధాన విభాగాధిపతులు, డివిజనల్ రైల్వే మేనేజర్ల భాగస్వామ్యంతో మంగళవారం జోన్ వ్యాప్తంగా భద్రతా సన్నద్ధతపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైల్వే నెట్‌వర్క్ వ్యాప్తంగా పటిష్టమైన, నిరాటంకమైన రైల్వే కార్యకలాపాలను నిర్ధారించడానికి తీసుకుంటున్న రైలు కార్యకలాపాల ప్రస్తుత స్థితి, సమయపాలన పనితీరు, భద్రతా నియమావళి, భద్రతా ఏర్పాట్లు, వివిధ చర్యలను అంచనా వేశారు. అత్యున్నత భద్రత , సేవా ప్రమాణాలను పాటిస్తూనే, కార్యాచరణ సామర్థ్యాన్ని బలోపేతం చేయడంపై చర్చలు జరిగాయి. జోన్ వ్యాప్తంగా రైళ్లలో, రైల్వే స్టేషన్లలో ప్రయాణికుల భద్రత, రక్షణ ఈ సమీక్షలో ఒక ముఖ్యమైన అంశంగా పేర్కొన్నారు. ప్రయాణికులకు సురక్షితమైన, భద్రమైన ప్రయాణ వాతావరణాన్ని నిర్ధారించడానికి నిరంతర అప్రమత్తత, భద్రతా విధానాలను ఖచ్చితంగా పాటించడం, ముందుచూపుతో కూడిన ప్రమాద అంచనా, విభాగాల మధ్య సమర్థవంతమైన సమన్వయం అవసరమని జనరల్ మేనేజర్ నొక్కి చెప్పారు. భద్రతకే ప్రథమ ప్రాధాన్యత, వినియోగదారులకే ప్రాధాన్యతనిచ్చే సేవ అనే సూత్రాలకు కట్టుబడి ఉండాలని ఆయన అధికారులు మరియు సిబ్బందికి పిలుపునిచ్చారు. కార్యాచరణ శ్రేష్ఠత పట్ల సౌత్ కోస్ట్ రైల్వే యొక్క నిబద్ధతను పునరుద్ఘాటిస్తూ, భారతీయ రైల్వేకు భద్రతే అత్యంత ప్రాధాన్యత అని జనరల్ మేనేజర్ నొక్కిచెప్పారు. జోన్ అంతటా భద్రత, భద్రతా ఏర్పాట్లు, సమయపాలన మరియు ప్రయాణీకుల సేవల్లో అత్యున్నత ప్రమాణాలను పాటించాలని సంబంధిత అధికారులందరినీ ఆయన ఆదేశించారు.

### 28 అవార్డులతో నిడదవోలు రోటరీ చరిత్ర..

# డిస్ట్రిక్ట్‌లో బెస్ట్ క్లబ్‌గా ఘనత






**నిడదవోలు జయ జయహే ప్రతినిధి:**

రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు సేవా కార్యక్రమాల్లో తన ప్రత్యేకతను మరోసారి నిరూపించుకుంది. విశాఖపట్నంలోని ఏ ఎం టి జెడ్ ప్రాంగణంలో రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ డా. వై. కళ్యాణ్ చక్రవర్తి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించిన "కళ్యాణ ప్రశస్తి అవార్డ్స్ నైట్ -- 2025-26" కార్యక్రమంలో క్లబ్ ఏకంగా 28 అవార్డులను కైవసం చేసుకుని డిస్ట్రిక్ట్ 3020లో అత్యుత్తమ "బెస్ట్ క్లబ్"గా నిలిచి చరిత్ర సృష్టించింది. 2025 జూలై 1 నుంచి 2026 జూన్ వరకు క్లబ్ చేపట్టిన వినూత్న సేవా కార్యక్రమాలు, సామాజిక సేవా ప్రాజెక్టులు, వివిధ సెమినార్లు మరియు అవగాహన కార్యక్రమాల్లో కనబరిచిన విశిష్ట ప్రతిభకు గుర్తింపుగా మొదట 17 ప్రధాన అవార్డులు, అనంతరం మరో 11 ప్రత్యేక పురస్కారాలు లభించాయి. దీంతో మొత్తం 28 అవార్డులు దక్కి క్లబ్‌కు అరుదైన గౌరవం దక్కింది. ఈ విజయాల్లో భాగంగా క్లబ్‌కు ప్రతిష్ఠాత్మకమైన "బెస్ట్ క్లబ్ ప్లాటినం అవార్డు" లభించగా, క్లబ్ అధ్యక్షుడు ౹అ. మీసాల శివరామ హరిప్రసాద్కు "బెస్ట్ ప్రెసిడెంట్ ప్లాటినం అవార్డు", కార్యదర్శి ౹అ. దారపురెడ్డి శ్రీరామ ప్రతాప్కు "బెస్ట్ సెక్రటరీ అవార్డు" ప్రదానం చేశారు. అదేవిధంగా డిస్ట్రిక్ట్ ట్రైనింగ్ అసెంబ్లీని విజయవంతంగా నిర్వహించినందుకు ప్రత్యేక గుర్తింపు అవార్డుతో పాటు, మానవతా దృక్పథంతో నిర్వహించిన వివిధ సేవా కార్యక్రమాలకు గాను క్లబ్‌కు మరో 13 డైమండ్, ప్లాటినం, గోల్డ్, సిల్వర్ అవార్డులు లభించాయి. వైజాగ్‌లో జరిగిన ఈ అవార్డుల వేడుకలో రోటరీ అసిస్టెంట్ గవర్నర్ గుంటిపల్లి శ్రీనివాసరావు, క్లబ్ అధ్యక్షుడు మీసాల శివరామ హరిప్రసాద్, కార్యదర్శి దారపురెడ్డి శ్రీరామ ప్రతాప్తో పాటు నిడదవోలు ప్రాంతానికి చెందిన పలువురు సీనియర్ రొటేరియన్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు మాట్లాడుతూ, ఈ అరుదైన విజయానికి కారణమైన ప్రతి రొటేరియన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. క్లబ్ చేపట్టిన ప్రతి సేవా యజ్ఞాన్ని విజయవంతం చేసిన సభ్యుల అంకితభావం వల్లే ఈ ఘనత సాధ్యమైందని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలతో సమాజానికి ఉపయోగపడే దిశగా ముందుకు సాగుతామని తెలిపారు.

### జనసేనలో కీలక కమిటీ పరిశీలుకలగా

## కొణతాల నియామకం

**అనకాపల్లి, జయ జయహే**



జనసేన పార్టీ సంస్థాగతను బలోపేతం దిశగా మరో కీలక నిర్ణయం జనసేన పార్టీ తీసుకోవడం జరిగింది. జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ రాష్ట్రంలో 25 పార్లమెంటు నియోజకవర్గం లకు సమాచార సేకరణ కమిటీ పరిశీలుకలను నియమించడం జరిగింది. అందులో భాగంగా అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ కు విశాఖపట్నం పార్లమెంట్ నియోజకవర్గం పరిశీలకులుగా నియమించడం జరిగింది. ప్రతి నియోజకవర్గంలో పార్టీ కార్యకర్తలు నాయకులు వారు ఏ బాధ్యతలు నిర్వహించాలను కుంటున్నారో వివరాలను సేకరించి పార్టీ కేంద్ర కార్యాలయానికి పంపనున్నారు సేకరించిన దరఖాస్తులు పరిశీలించి అభిప్రాయాలను పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ స్వయంగా పరిశీలించి తుది నిర్ణయం తీసుకోనున్నారు ఈ చర్య ద్వారా పార్టీ నిర్మాణాన్ని మరింత బలోపేతం చేయడం తో పాటు క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న కార్యకర్తలకు తగిన అవకాశాలు కల్పించాలని లక్ష్యంతో జనసేన పార్టీ ముందుకు సాగుతోంది అలాగే జనసేన వీర మహిళలు నుంచి పార్టీలో గల వివిధ పదవులు కోసం దరఖాస్తులను స్వీకరించడం జరుగుతున్నదని వారు తెలిపారు

## యువతకు సువర్ణ అవకాశం...

### పాడేరులో భారీ ఉద్యోగాల మేళా..

### కొయ్యూరు మండల అభివృద్ధి అధికారి జిడివి ప్రసాదరావు..

**కొయ్యురు (జయ జయహే ) న్యూస్ జూన్ 24.**



అల్లూరి జిల్లా కొయ్యూరు మండల యువతకు ఉద్యోగ అవకాశాలను కల్పించేందుకు పాడేరు ప్రభుత్వ పట్టభద్ర కళాశాలలో బుధవారం భారీ ఉద్యోగాల మేళా నిర్వహించనున్నారు. రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జరిగే ఈ మేళాలో 13 కార్పొరేట్ సంస్థల ప్రతినిధులు పాల్గొని అభ్యర్థులకు నేరుగా మాటలు జరిపి ఎంపిక చేస్తారు. 10వ తరగతి, ఇంటర్మీడియట్, వృత్తి విద్య, పట్టభద్రులు, పట్టభద్రోత్తర చదువు చదివిన నిరుద్యోగ యువత ఈ మేళాకు తమ చదువు పత్రాలతో హాజరు కావాలి. మండల అభివృద్ధి అధికారి జిడివి ప్రసాదరావు మాట్లాడుతూ కొయ్యూరు మండలానికి చెందిన నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. మంచి జీతంతో ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉంది. అందరూ పత్రాలతో వెళ్లి పాల్గొనాలని కోరారు. యువత ఉపాధి పొంది, కుటుంబానికి అండగా నిలబడేందుకు ఇది మంచి వేదిక అని అధికారులు తెలిపారు.




## అధిక లోడ్ ఇసుక రవాణాపై ఉక్కుపాదం

### ప్రత్యేక నిఘా, ఉల్లంఘనలకు కఠిన చర్యలు

**రాజమహేంద్రవరం, జయజయహే బ్యూరో:**

జిల్లాలో అధిక లోడ్‌తో ఇసుక రవాణా చేసే వాహనాలపై బుధవారం నుంచి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి కఠిన చర్యలు చేపడతామని జిల్లా జాయింట్ కలెక్టర్ వై. మేఘా స్వరూప్ హెచ్చరించారు. నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తరలించడం వల్ల రహదారుల భద్రత దెబ్బతినడంతో పాటు ప్రభుత్వ ఆదాయానికి నష్టం కలుగుతోందని ఆయన పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఇసుక రీచ్ పాయింట్ల నిర్వహణ ఏజెన్సీలు, ట్రాన్స్‌పోర్టర్లు, మైన్స్, రవాణా, ఇరిగేషన్, పోలీస్ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో జాయింట్ కలెక్టర్ కీలక ఆదేశాలు జారీ చేశారు. అధిక లోడ్‌తో ఇసుక రవాణా చేసే వాహనాలపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, అలాంటి వాహనాలను పంపించే రీచ్ నిర్వహణ ఏజెన్సీల బాధ్యతను కూడా నిర్ధారిస్తామని స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై అపరాధ రుసుములు విధించడం, వాహనాలను సీజ్ చేయడం వంటి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అవసరమైతే సంబంధిత రీచ్ పాయింట్ల నిర్వహణ సంస్థలపైనా చర్యలు ఉంటాయని తెలిపారు. అనుమతించిన పరిమితికి మించి ఇసుక లోడింగ్ చేయడం వల్ల రహదారులు దెబ్బతినడం, రోడ్డుపై ఇసుక జారిపడటం, ప్రమాదాలు పెరగడం వంటి సమస్యలు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు. అధిక లోడ్ రవాణా కారణంగా ప్రజా ఆస్తులకు నష్టం వాటిల్లడమే కాకుండా ప్రభుత్వానికి ఆదాయ నష్టం కూడా కలుగుతోందని జాయింట్ కలెక్టర్ వివరించారు. ప్రతి రీచ్ వద్ద లోడింగ్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని, పరిమితికి మించి ఇసుక ఎక్కించకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై ఎలాంటి మినహాయింపులు ఉండవని స్పష్టం చేశారు. ఇసుక రవాణా వ్యవస్థను పారదర్శకంగా, క్రమబద్ధంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. మైన్స్, రవాణా, ఇరిగేషన్, పోలీస్ శాఖలు సంయుక్త తనిఖీలు నిర్వహించి అక్రమాలను అరికట్టాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా మైన్స్ అధికారి డి. ఫణి భూషణ్ రెడ్డి, జిల్లా రవాణా అధికారి ఆర్. సురేష్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# పవన్ కళ్యాణ్‌పై విమర్శలు మానుకోవాలి

### పోలిరెడ్డి వెంకటరత్నం

**నిడదవోలు జయ జయహే ప్రతినిధి:**



నిడదవోలు మంత్రి కందుల దుర్గేష్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో జనసేన నిడదవోలు మండల అధ్యక్షుడు పోలిరెడ్డి వెంకటరత్నం మాట్లాడుతూ, జనసేన పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్పై అనవసర విమర్శలు చేయడం మానుకుని ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని వైసీపీ నాయకులకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పవన్ కళ్యాణ్‌ను లక్ష్యంగా చేసుకుని కొందరు వైసీపీ నాయకులు చేస్తున్న వ్యాఖ్యలను ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. కాపు సమాజం పేరుతో రాజకీయ ప్రయోజనాలు పొందిన నాయకులు, అదే సమాజానికి చెందిన నాయకులను విమర్శించడం సమంజసం కాదని పేర్కొన్నారు. పవన్ కళ్యాణ్ 2019లో ఒంటరిగా రాజకీయ ప్రయాణాన్ని ప్రారంభించి ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేశారని, 2024 ఎన్నికల్లో రాష్ట్ర రాజకీయాల్లో కీలక శక్తిగా ఎదిగారని వెంకటరత్నం తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి, యువత భవిష్యత్తు, బడుగు బలహీన వర్గాల సంక్షేమమే జనసేన పార్టీ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. జనసేన పార్టీ కుల, మతాలకు అతీతంగా పనిచేస్తోందని, రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ కూడా పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని కొనియాడారు. ఇకనైనా వైసీపీ నాయకులు వ్యక్తిగత విమర్శలు, కుల రాజకీయాలు పక్కనపెట్టి ప్రజా సంక్షేమం కోసం పనిచేయాలని సూచించారు. రాష్ట్ర ప్రజలు అన్ని రాజకీయ పరిణామాలను గమనిస్తున్నారని, ప్రజల తీర్పును గౌరవించే విధంగా రాజకీయాలు చేయాలని హితవు పలికారు. అదేవిధంగా పవన్ కళ్యాణ్‌పై అసత్య ఆరోపణలు చేసి ఆయన ప్రతిష్టను దెబ్బతీసే ప్రయత్నాలు చేస్తే జనసైనికులు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. ప్రజా సమస్యల పరిష్కారం, సమాజ అభ్యున్నతే జనసేన పార్టీ లక్ష్యమని, అదే దిశగా పార్టీ ముందుకు సాగుతుందని పోలిరెడ్డి వెంకటరత్నం స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు



## దేశ ఐక్యత సమగ్రతే శ్యాం ప్రసాద్ ముఖర్జీ ఆశయం

### ఒకే దేశం ఒక రాజ్యాంగం ఓకే జెండా ఆయన లక్ష్యం

**టెక్కలి జూన్ 23 జయ జయహే**

భారతదేశ సమగ్రత ఐక్యత ఒకే జెండాతో వర్ధిల్లాలని లక్ష్యంతో తన ప్రాణాలను అర్పించిన త్యాగమూర్తి డాక్టర్ శ్యాం ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్ టెక్కలి బిజెపి ప్రతినిధులు ఆయనకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా టెక్కలి మండలం భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు జర్జన రామ్ జీ మాట్లాడుతూ దేశ ప్రజలంతా ఒకే తాటిపై నడిచి ప్రగతిని సాధించాలనే లక్ష్యం డాక్టర్ శ్యాం ప్రసాద్ ముఖర్జీ ముఖ్య ఆశయమని ఆయన కన్న కలలను ప్రతి ఒక్కరూ నిజం చేయాలని ముఖర్జీని స్మరించుకున్నట్లు తెలిపారు, ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర యువ మోర్చా ఉపాధ్యక్షులు బూరె నరేంద్ర, జిల్లా కార్యదర్శి గుణ మీనా కుమార్, మండల కార్యదర్శి శ్రీను, ప్రతినిధులు పీస లవణ కుమార్, తదితరులు పాల్గొన్నారు.



## సీజ్ చేసిన వాహనాలు ఇచ్చేస్తున్నాం...!

### ఇదే అసలు సిసలైన ఫ్రెండ్లీ పోలీసింగ్

### విశాఖ పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖ బ్రత బాగ్చి

**విశాఖపట్నం, జూన్ 23, జయ జయహే**

ఫ్రెండ్లీ పోలీసింగ్ వ్యవస్థలో భాగంగా సీజ్ చేసిన వాహనాలను ఆయా వాహన యజమానులకు అందిస్తున్నామని విశాఖ పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖ బ్రత బాగ్చి అన్నారు. వివిధ రూపాల్లో సీజ్ చేసిన వాహనాలను ఆయా యజమానులకు అందించే చర్యలు గత 5 విడతలుగా నిర్వహిస్తున్నామని ఈ ఆరో విడతలలో దాదాపు 538 వాహనాలను అభ్యర్థులకు అందిస్తున్నామని చెప్పారు. ఈ మేరకు మంగళవారం పోలీస్ కమిషనరేట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వివిధ నేరాల్లో ఇతరత్రా రూపాల్లో సీజ్ చేసిన వాహనాలను సంవత్సరాల తరబడి పోలీస్ స్టేషన్ లోనే ఉన్న వాహనాలపై దృష్టి సారించడం జరిగిందన్నారు. ఎక్కువ కాలం వాహనాలు అలాగే ఉండిపోతే పాడైపోయే ప్రమాదం ఎక్కువగా ఉంటుందని , అందుకే నెలల తరబడి ఉండిపోయిన వాహన యజమానులను గుర్తించడం జరిగిందని తెలిపారు. గత రెండేళ్ల కాలంగా విశాఖ సిటీ పరిధిలో వెహికల్స్ రిటర్న్ మేళాను చేపడుతున్నామని, ఇప్పటి వరకు ఐదు విడతల్లో యజమానులకు వాహనాలను ఇవ్వడం జరిగిందని గుర్తు చేశారు. మొదటి విడతలో 122 ,రెండవ విడతలో 320 వాహనాలను యజమానులకు అప్పగించామని, మూడు ,నాలుగు, ఐదవ విడతల్లో 1080 వాహనాలకు రిలీజ్ చేశామని చెప్పారు. 6 వ విడతలో అత్యధికంగా 538 ని వాహనాలను అప్పగించడం జరుగుతుందని, లా అండ్ ఆర్డర్, క్రైం,ట్రాఫిక్ విభాగాల నుండి సీజ్ చేసిన వాహనాలను రిలీజ్ చేస్తున్నామని చెప్పారు.



## ఆగ్రో ఫారెస్ట్రీ మొక్కల పంపిణీతో రైతులకు ప్రోత్సాహం

**అనంతగిరి: జయ జయహే.**

అనంతగిరి మండలం, పెదకోట పంచాయతీలో సభలు ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఆగ్రో ఫారెస్ట్ మొక్కల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు బీడు భూములను సద్వినియోగం చేసుకోవాలని ఉద్దేశంతో రైతులకు ఎకరాకు 100 మొక్కలు చొప్పున పంపిణీ చేశారు ఈ సందర్భంగా రైతులకు కొబ్బరి, జామ, టేకు, సపోటా, సీతాఫలం మొక్కలను అందజేశారు ప్రధాన పంటగా కొబ్బరితో పాటు అంతర పంటలుగా మామిడి 30, జామ 10, టేకు 30, సపోటా 10, సీతాఫలం 10 మొక్కలను క్లస్టర్ కోఆర్డినేటర్ మాణిక్యం మొక్కల పెంపకం చేశారు. ఈ మొక్కల పెంపకం ద్వారా రైతులకు దీర్ఘకాలిక ఆదాయం లభించడంతోపాటు పర్యావరణ పరిరక్షణకు కూడా తోడ్పాటు అందుతుందని ఆయన పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అన్నపూర్ణాదేవి, రైతులు గ్రామస్తులు పాల్గొన్నారు

# కూటమి ప్రభుత్వంలో అణచివేత ధోరణి

## వైసిపి నేతల ఆగ్రహం

**రాజమహేంద్రవరం: జయ జయహే**



జూన్ 23:రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయినా, ఎన్నికల ముందు ఇచ్చిన 'సూపర్ సిక్స్' హామీలను నెరవేర్చడంలో ఘోరంగా విఫలమైందని వైఎస్సార్సీపి బిసి , ఎస్సీ, మైనారిటీ విభాగాల నాయకులు మండిపడ్డారు. మంగళవారం స్థానిక వీఎల్ పురం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. హామీలను నిలదీస్తున్న వారిపై అక్రమ అరెస్టులు, పిడి చట్టాలను ప్రయోగిస్తూ కక్షసాధింపు రాజకీయాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు.వైసిపి బిసి నేత పీత రామకృష్ణను అక్రమంగా అరెస్టు చేయడాన్ని నాయకులు తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్యబద్ధంగా ప్రశ్నలు అడిగేవారిపై పిడి చట్టం ప్రయోగించడం అప్రజాస్వామికమని అన్నారు.సూపర్ సిక్స్ హామీల వైఫల్యం నుండి ప్రజల దృష్టి మళ్లించేందుకే ప్రభుత్వం డైవర్షన్ రాజకీయాలు చేస్తోందని మైనారిటీ సెల్ అధ్యక్షులు చోటా ఖాన్ ఆరోపించారు. మైనారిటీల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం మొండిచేయి చూపిస్తోందని హసీనా బేగం విమర్శించారు. రాబోయే మూడేళ్లలోనైనా హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఎమ్మెల్యే పంతం నానాజీ, మాజీ ఎంపి భరత్‌పై చేస్తున్న వ్యాఖ్యలను నాయకులు ఖండించారు. చంద్రబాబు, లోకేశ్‌లు 'దోచుకో-దాచుకో' అన్నట్లుగా పాలన సాగిస్తున్నారని విమర్శించారు.ఈ కార్యక్రమంలో వైసిపి బిసి నాయకులు మార్గాని సురేష్, సూరిబాబు, మైనారిటీ విభాగం నాయకులు కరీం ఖాన్, రాష్ట్ర నాయకురాలు హసీనా బేగం, చోటా ఖాన్, అనంతలక్ష్మితో పాటు బిసి , ఎస్సీ, మైనారిటీ మరియు మహిళా విభాగాలకు చెందిన పలువురు కీలక నాయకులు పాల్గొన్నారు.



# ఓల్డ్‌ఏజ్ హోమ్‌లో చంద్రమౌళి జన్మదిన వేడుకలు

**విశాఖపట్నం (జయ జయహే)**

వైస్సార్సీపీ జిల్లా యువజన విభాగం ప్రధాన కార్యదర్శి గుమ్మడి చంద్ర మౌళి జన్మదినం సందర్భంగా సెయింట్ జోసెఫ్ ఓల్డేజ్ హోమ్ లో ఘనంగా నిర్వహించారు .ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆంధ్రప్రదేశ్ క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొల్లవరపు జాన్ వెస్లీ విచ్చేసి చంద్ర మౌళి కు జన్మదిన శుభాకాంక్షలు తెలియచేసి . పుట్టినరోజు కేక్ ని కట్ చేయడం జరిగింది. అనంతరం హోం లో ఉన్న వృద్ధులందరికీ జాన్ వెస్లీ చేతుల మీదగా మధ్యాహ్న భోజనం వడ్డించడం జరిగింది. ఈ సందర్భంగా జాన్ వెస్లీ మాట్లాడుతూ చంద్రమౌళి నిరాడంబరమైన నాయకుడని, వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆశయాలను ప్రజలలోకి తీసుకు వెళ్లడానికి ఆయన చేస్తున్న ప్రయత్నం అందరికీ ఆదర్శమని తెలియజేశారు. ఈ వార్డు అధ్యక్షుడు పీతల వాసు మరియు వైఎస్ఆర్సిపి రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి కనకల ఈశ్వర్ తో కలిసి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని దక్షిణ నియోజకవర్గంలో బలోపేతం చేయడంలో ముందు వరుసలో ఉన్నాడని తెలియజేశారు. దక్షిణ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్ కుమార్ ఆశీస్సులతో చంద్రమౌళి చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రశంసించారు. .ఈ కార్యక్రమంలో 29వ వార్డు అధ్యక్షులు పీతల వాసు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువజన విభాగం జనరల్ సెక్రెటరీ కనకల ఈశ్వర్, ఎలమంచిలి సంతోష్ కుమార్, బండాడ వెంకటరమణ, సూర్య ,అఖిల్ ,పెంటయ్య, మహిళా నాయకురాలు రూప తదితరులు పాల్గొన్నారు



# మంచి ప్రణాళికతో ముందుకుసాగుతాం

## జేసీఐ సన్ రైజర్స్ అధ్యక్షురాలు షర్మిల

**శ్రీకాకుళం (జయ జయహే )**

మంచి ప్రణాళికతో ముందుకుసాగుతామని, జేసీఐ సన్ రైజర్స్ అధ్యక్షురాలు షర్మిల అన్నారు. మంగళవారం ఆమె ఒక ప్రకటనలో మాట్లాడుతూ విశాఖలో జరిగిన దళపతి మిడకాన్ లో, ప్రతిష్టాత్మిక అవార్డులతో శ్రీకాకుళం సన్ రైజర్స్ ప్రభంజనం సృష్టించిందని, ఎన్నో అవార్డులు, రివార్డులు సొంతం చేసుకుందని, రానున్న కార్యక్రమాలలో ప్రజలకు, ముఖ్యంగా యువతకు మార్గదర్శం చేస్తూ, నాయకత్వ లక్షణాలు, ప్రజాసేవలో నడిపించే బాధ్యతను తీసుకుంటామని, ఇందుకు ప్రభుత్వ అధికారులను, స్వచ్ఛంద సంస్థలను సమన్వయము చేసుకుంటూ కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. సంస్థ కార్యదర్శి జేసీ వెంకటేష్ మాట్లాడుతూ సభ్యుల సమిష్టి కృషి ఫలితంగానే ఈ విజయాలు సాధ్యమయ్యాయని, ఇదే ఉత్సాహంతో మరిన్ని కార్యక్రమాలు చేపడతామని అన్నారు. వ్యక్తిగత విభాగాల్లో అవార్డులు అందుకున్నవారిలో బెస్ట్ ఆఫీసర్ డా. అన్నెపు అశోక్, బెస్ట్ లేడీ జేసీ డా.సీపాన జోష్ణ, బెస్ట్ న్యూ జేసీ తిర్లంగి రమేష్, సంతోషి, బెస్ట్ జేసీగా వెంకటేష్ ఐతం నిలిచారన్నారు. జేసీఐ శ్రీకాకుళం సన్‌రైజర్స్ సాధించిన ఈ విజయాలపై సభ్యులు, నగర ప్రముఖులు, వక్తలు హర్షవ్యక్తం చేస్తూ, అవార్డు గ్రహీతలను అభినందించారు. ఈ కార్యక్రమంలో చార్టర్ ప్రెసిడెంట్, జోన్ ఆఫీసర్ జేఎఫ్‌డీ దూసి సంతోష్, జోన్ డైరెక్టర్ జూనియర్ జేసీ జేఎఫ్ఎం ప్రవీణ్ కుమార్ సింగూరు తదితరులు పాల్గొన్నారు.



# సీటీయూ స్నాతకోత్సవానికి అతిథిగా గవర్నర్ అబ్దుల్ నజీర్

**విజయనగరం (జయ జయహే)**

కేంద్ర గిరిజన విశ్వవిద్యాలయం ఆంధ్రప్రదేశ్ తొలి స్నాతకోత్సవానికి హాజరుకావలసిందిగా విశ్వవిద్యాలయ కులపతి ప్రొఫెసర్ టి. శ్రీనివాసన్ ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ ని విజయవాడలోని లోక్ భవన్‌లో మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానించారు.ఈ సందర్భంగా గవర్నర్ ఆహ్వానాన్ని సాదరంగా స్వీకరించి, విశ్వవిద్యాలయం తొలి స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరుకావడానికి తన సమ్మతిని తెలియజేశారు.ఈ సమావేశంలో ప్రొఫెసర్ టి. శ్రీనివాసన్ విశ్వవిద్యాలయంలో జరుగుతున్న విద్యా, అభివృద్ధి కార్యక్రమాలను గవర్నర్ కి వివరించారు. విశ్వవిద్యాలయం అందిస్తున్న వివిధ విద్యా కార్యక్రమాలు, జాబ్ ఒరీఎంటెడ్ ఎడ్యుకేషన్ అండ్ రిహాబిలిటేషన్ కార్యక్రమాలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి, గిరిజన సంక్షేమ కార్యక్రమాలు, విస్తరణ మరియు సమాజ అనుసంధాన కార్యక్రమాల గురించి వివరించారు.అలాగే, జాతీయ విద్యా విధానం (ఎన్ఈపి -- 2020) లక్ష్యాలకు అనుగుణంగా 2023--24 విద్యా సంవత్సరంనుంచి విశ్వవిద్యాలయంలోని అన్ని విద్యా కార్యక్రమాలను రూపకల్పన చేసి అమలు చేస్తున్నామని, బహుళశాఖా విద్య, సమగ్రత మరియు నైపుణ్యాధారిత ఉన్నత విద్యకు విశ్వవిద్యాలయం కట్టుబడి ఉందని తెలియజేశారు.విశ్వవిద్యాలయం విద్యా కార్యక్రమాలు విజన్, మరియు ముఖ్యంగా గిరిజన సమాజ అభ్యున్నతి, సాధికారత, సామాజిక-ఆర్థిక అభివృద్ధి కోసం చేస్తున్న కృషిని గవర్నర్ అభినందించారు. నాణ్యమైన ఉన్నత విద్య అందించడంలో విశ్వవిద్యాలయం చేస్తున్న ప్రయత్నాలను ప్రశంసించారు.ఈ సందర్భంగా గవర్నర్ ప్రోత్సాహం, సహకారానికి విశ్వవిద్యాలయం కృతజ్ఞతలు తెలియజేసింది. సీటీయూఏపీ చరిత్రలో మైలురాయిగా నిలిచే తొలి స్నాతకోత్సవానికి గవర్నర్ గౌరవప్రదమైన హాజరు కోసం విశ్వవిద్యాలయం ఆసక్తిగా ఎదురుచూస్తోంద ని వీసీ శ్రీనివాసన్ తెలియజేశారు.



# భూములిచ్చిన 520 మందికి న్యాయం చేయాలని వినతి

## సానుకూలంగా స్పందించిన డిప్యూటీ స్పీకర్

**ఆనందపురం, జూన్ 23:(జయ జయహే)**

గూగుల్ డేటా సెంటర్ కు భూములిచ్చిన తమకు న్యాయం చేయాలని తర్లువాడకు చెందిన రైతులు డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజును కోరారు. పిటిషన్స్ కమిటీ సమావేశం కోసం మంగళవారం జిల్లా కలెక్టరేట్ కు వచ్చిన ఆయన్ను కలిసి ఈ మేరకు వినతి పత్రాన్ని అందజేశారు. రాష్ట్రాభివృద్ధి కోసం కృషి చేస్తున్న సీఎం చంద్రబాబుపై గౌరవంతో తర్లువాడ సర్వే నెంబర్ 1 లో 100 ఎకరాలు ఇచ్చామన్నారు. భూసేకరణ సమయంలో సర్క్యూట్ హౌస్ లో నిర్వహించిన సమావేశంలో 520 మందికి మూడు సెంట్ల ఇళ్ల స్థలాలు ఇస్తామని జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే ఆర్డీఓ, ఎమ్మార్వో లు హామీ ఇవ్వడం వల్ల తమ స్వాధీనంలోని భూములను అప్పగించామని తెలిపారు. 2020-21 లో ఒక సెంటు ఇళ్ల స్థలాల పూలింగ్ కోసం తీసుకోవడానికి వైసీపీ ప్రభుత్వం ప్రయత్నించగా తాము అంగీకరించలేదని, కోర్టులో 11207/ 2020 నెంబరుతో కేసు వేశామని వివరించారు. 200 ఎకరాల్లో గ్రావెల్ క్వారీ కోసం డీఆర్ఓ ప్రజాభిప్రాయ సేకరణ చేసినప్పుడు కూడా 520 మంది వ్యతిరేకించి జిల్లా కలెక్టర్ కు అర్జీలు సమర్పించామని చెప్పారు. డి పట్టాలున్న వారికి 20 శాతం నివేశన స్థలం, 20 ళ 25 సైజు షాపులు, కుటుంబానికి ఒక ఉద్యోగం చొప్పున ఇస్తామన్న హామీలు ఇంకా నెరవేరలేదని పేర్కొన్నారు. ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని రఘు రామకృష్ణంరాజు వారికి హామీ ఇచ్చారు. టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు తాత్రాజు అప్పారావు, తర్లువాడ మాజీ సర్పంచులు బి.ఆర్.బి. నాయుడు, బాలి అయ్యప్ప, జనసేన జిల్లా కార్యదర్శి మజ్జి శ్రీను, కోరాడ ఆదినారాయణ, బంకు రాజు, కన్నయ్య, బాలి వెంకటరాజు తదితరులు ఉన్నారు.

# జిహెచ్ఎస్ విద్యార్థులు మెరిట్ స్కాలర్షిప్‌ని పొందడం అభినందనీయం

## మండల విద్యాశాఖ అధికారులు.

**ఆమదాలవలస. - (జయ జయహే )**




ఆమదాలవలస ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ముగ్గురు ఎన్సిసి విద్యార్థులకు 2025 26 సంవత్సరానికి క్యాడిట్ వెల్ఫేర్ సొసైటీ మెరిట్ స్కాలర్షిప్స్ ని ప్రకటించి, అందించడంపట్ల ఆముదాలవలస మండల విద్యాశాఖ అధికారులు కే.ఏ.రాములు, టింగ.రాజు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు పైల.రవికుమార్, ఎన్సిసి అధికారులు పి.మోహనరావు, బంగారు శరత్ కుమారి, జెవివి ఎడ్యుకేషన్ రాష్ట్ర కన్వీనర్ గొంటి గిరిధర్, జిటిఏ జిల్లా అధ్యక్షులు పి.రామస్వామి నాయుడులు అభినందించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులు తుమ్మ.సోమేశ్వరరావు (10వ తరగతి), చీమల.హరిత (9వ తరగతి), డోల.పూజిత (9వ తరగతి) విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ. 6 వేలు చొప్పున ప్రైజ్ మనీతో పాటు, జ్ఞాపిక, ప్రశంసాపత్రాలను అందజేశా రు. ఎన్సీసీలో క్రమశిక్షణ అకాడమిక్స్ లో ప్రావీణ్యత ఆధారంగా 14 ఆంధ్ర బెటాలియన్ శ్రీకాకుళం పరిధిలోని కేంద్ర రాష్ట్ర పాఠశాలలు, సైనిక్ స్కూల్స్, పాలిటెక్నిక్ కళాశాలల నుండి మొత్తం 18 మంది మెరిట్ స్కాలర్షిప్స్ కి అర్హత పొందగా, ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆమదాలవలస నుండి ముగ్గురు విద్యార్థులు మెరిట్ స్కాలర్షిప్ ని పొందడం అభినందనీయమని ప్రశంసించారు. కార్యక్రమంలో స్కాలర్షిప్ పొందిన విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.




# ఘనంగా ఓలింపిక్ క్రీడా దినోత్సవం


**అనకాపల్లి (జయ జయహే)**

ఒలింపిక్ క్రీడా దినోత్సవం సందర్భంగా ఏ ఎం ఏ ఎల్ కళాశాల ప్రాంగణంలో అబ్దుల్ కలాం సేవా సంఘం వ్యవస్థాపక చైర్మన్ ఆళ్ళ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఏ ఎం ఏ ఎల్ కళాశాల ప్రిన్సిపాల్ బొత్స సాగర్ భారతదేశ ఒలింపిక్ క్రీడాకారుడు, పద్మభూషణ్ అవార్డు గ్రహీత ధ్యాన్చంద్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించడం జరిగింది, ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ధ్యాన్చంద్ గుర్తు చేసుకుంటూ క్రీడా ప్రపంచంలో భారతదేశ గౌరవాన్ని పెంచిన ధ్యాన్చంద్ ప్రతిభావంతులైన క్రీడాకారులు, నైపుణ్యం కలిగిన కోచ్‌లు మరియు క్రీడా నైపుణ్యం కనబరుస్తున్న క్రీడాకారులను "అంతర్జాతీయ ఒలింపిక్ దినోత్సవం" సందర్భంగా క్రీడలను ప్రతి ఒక్కరు కూడా క్రమశిక్షణతో విలువలు రావాలని సందర్భంగా అందరికీ తెలియపరచడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ డివిఎంసి సభ్యులు రేబాక మధుబాబు,పీవీ సుధాకర్, పిటి మాస్టర్ కొణతాల స్వామి నాయుడు, ఆడారి నూకినాయుడు, బి.ఎం నాయుడు, పెంటకోట సాగర్, ఏ ఏం ఏ ఎల్ కళాశాల విద్యార్థి,విద్యార్థులు,తదితరులు పాల్గొన్నారు.

# సౌత్ జోన్ వేదికగా పోలీసుల 'స్పెషల్ డ్రైవ్'

## నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు!

**రాజమహేంద్రవరం: జయ జయహే**



జూన్ 23: రోడ్డు భద్రతను పటిష్టం చేయడంతో పాటు, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసే లక్ష్యంతో తూర్పుగోదావరి జిల్లా సౌత్ జోన్ పరిధిలో పోలీసులు విస్తృత వాహన తనిఖీలు చేపట్టారు. జిల్లా ఎస్పీ డి. నరసింహ కిషోర్ ఆదేశాల మేరకు, సౌత్ జోన్ డిఎస్పీ ఎ. శివప్రియ పర్యవేక్షణలో ఈ ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు.ఈ తనిఖీల్లో సరైన పత్రాలు లేని వాహనాలు, అనుమానాస్పద వాహనాలను గుర్తించి అధికారులు తనిఖీ చేశారు. ముఖ్యంగా అతివేగం, ట్రిపుల్ రైడింగ్, మైనర్ డ్రైవింగ్, ఓవర్‌లోడింగ్, మద్యం సేవించి వాహనం నడపడం, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం, డిఫెక్టివ్ నంబర్ ప్లేట్లు, అనధికార పార్కింగ్ వంటి ఉల్లంఘనలకు పాల్పడిన వారిపై కేసులు నమోదు చేసి జరిమానాలు విధించారు. మైనర్లు వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని, తల్లిదండ్రులు బాధ్యతగా వ్యవహరించి పిల్లలకు వాహనాలు ఇవ్వకూడదని హెచ్చరించారు.పరిమితికి మించి ప్రయాణీకులను తరలించే ఆటోల విషయంలో కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు.డ్రైవింగ్ లైసెన్స్, ఆర్సీ, ఇన్సూరెన్స్ వంటి పత్రాలను ఎల్లప్పుడూ వెంట ఉంచుకోవాలని, హెల్మెట్ మరియు సీట్‌బెల్ట్ ధరించడం తప్పనిసరి అని సూచించారు.నేరాల నివారణలో భాగంగా చోరీ వాహనాలను గుర్తించడమే ఈ తనిఖీల ముఖ్య ఉద్దేశమని పోలీసులు తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలను గౌరవిస్తూ పోలీసులకు సహకరించాలని, ఏదైనా అనుమానాస్పద వ్యక్తులు లేదా వాహనాలు కనిపిస్తే వెంటనే తమకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో సౌత్ జోన్ పరిధిలోని ఇన్‌స్పెక్టర్లు,పి.కాశీ విశ్వనాథం,పి.శివ గణేష్, ఎ . వెంకటేశ్వరరావు లతో పాటు పలువురు ఎస్సైలు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



## రాజమండ్రిలో ఘనంగా శ్యామాప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్

**రాజమహేంద్రవరం: జయ జయహే**

జూన్ 23:ఒకే దేశం, ఒకే రాజ్యాంగం, ఒకే జెండా" అనే ఆశయ సాధన కోసం కాశ్మీర్ కోసం ప్రాణాలర్పించిన భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకులు డాక్టర్ శ్యామాప్రసాద్ ముఖర్జీ గారి బలిదాన్ దివస్ కార్యక్రమం ఈరోజు రాజమండ్రి బిజెపి కార్యాలయంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి బిజెపి జాతీయ కార్యవర్గ సభ్యులు, ఎం.ఎల్.సి శ్రీ సోము వీర్రాజు గ( ముఖ్య అతిథిగా హాజరై, ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన దేశ సమగ్రత కోసం ముఖర్జీ గారు చేసిన త్యాగాలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఓబిసి మోర్చా రాష్ట్ర అధ్యక్షులు రొంగల గోపి శ్రీనివాస్, అడబాల రామకృష్ణ, నర్సపల్లి హారిక, రవిశంకర్, కురగంటి సతీష్, శెట్టిపల్లి శివనాగరాజు, తూర్పుగోదావరి జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి, బలిదాన్ దివస్ జిల్లా కన్వీనర్లతో పాటు బావి రామారావు, కందికొండ రమేష్, తగరం సురేష్ తదితర బిజెపి శ్రేణులు పాల్గొన్నారు.



## విశాఖ బాడీ బిల్డర్స్ అసోసియేషన్ ప్రమాణ స్వీకారం

**అసోసియేషన్ అధ్యక్షుడిగా నియమితులైన ఈశ్వరరావు**

**విశాఖపట్నం, జూన్ 23: (జయ జయహే)**

విశాఖ బాడీ బిల్డర్స్ అండ్ ఫిట్‌నెస్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడిగా జి. ఈశ్వరరావు, కార్యదర్శిగా విజయ్ రెడ్డి బాధ్యతలు స్వీకరించారు.మాజీ సైనికుడుగా సేవలందించిన ఈశ్వరరావు, ఇండియన్ బాడీ బిల్డర్స్ ఫెడరేషన్ జడ్జిగా కూడా గుర్తింపు పొందారు. ఆయన అధ్యక్షుడిగా నియమితులవడంపై పలువురు క్రీడా ప్రముఖులు, అభిమానులు, సంఘ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలియజేశారు. వారి నాయకత్వంలో అసోసియేషన్ మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు ఈశ్వరరావు మాట్లాడుతూ, బాడీ బిల్డింగ్ అసోసియేషన్ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించడం తనకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. బాడీ బిల్డింగ్ క్రీడ తనకు మంచి గుర్తింపు తీసుకువచ్చిందని, ఈ పదవి తనపై మరింత బాధ్యతను పెంచిందని పేర్కొన్నారు. అసోసియేషన్ అభివృద్ధికి తన శక్తి మేరకు కృషి చేస్తానని, యువతలో ఫిట్‌నెస్‌పై అవగాహన పెంచడంతో పాటు ప్రతిభావంతులైన బాడీ బిల్డర్లను తయారు చేయడానికి ప్రత్యేక చర్యలు చేపడతానని తెలిపారు. విశాఖ జిల్లాను బాడీ బిల్డింగ్ రంగంలో రాష్ట్ర, జాతీయ స్థాయిలో మరింత ఉన్నత స్థానంలో నిలిపేందుకు కృషి చేస్తానని ఈశ్వరరావు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు, క్రీడాకారులు, ఫిట్‌నెస్ రంగ ప్రముఖులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




## ఘనంగా ఒలింపిక్ రన్ టీ-షర్ట్స్, టోపీల ఆవిష్కరణ

**విజయనగరం:(జయ జయహే )**

జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 28వ తేదీన విజయనగరం నగరంలో ప్రతిష్టాత్మకంగా 'ఒలింపిక్ రన్' నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన టీ-షర్ట్స్ , టోపీల ఆవిష్కరణ కార్యక్రమం మంగళవారం స్థానిక జి.ఎస్.ఆర్ హోటల్‌లో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ.. ఈ నెల 28న జరిగే ఒలింపిక్ రన్ స్థానిక కోట వద్ద నుండి ప్రారంభమై మూడు లాంతర్లు, గంటస్తంభం మీదుగా రాజీవ్ స్టేడియం వరకు కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు, విజయనగరం శాసనసభ్యురాలు అదితి గజపతిరాజు, ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసుల నాయుడు, ఆంధ్రప్రదేశ్ తూర్పు కాపు కార్పొరేషన్ చైర్మన్ పాలవలస యశస్విని, జిల్లా ఎస్పీ ఎ.ఆర్ దామోదర్, జిల్లా క్రీడాధికారి (డి ఎస్ డి ఓ) వెంకటేశ్వరరావులతో పాటు పలువురు ప్రముఖులను ఆహ్వానించినట్లు వెల్లడించారు. జిల్లాలోని క్రీడాకారులు, వ్యాయామ ప్రేమికులు, యువత , క్రీడా ప్రోత్సాహకులు అందరూ ఈ నెల 28న నిర్వహించే ఒలింపిక్ రన్‌లో పెద్ద ఎత్తున పాల్గొని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఈ సందర్భంగా వారు పిలుపునిచ్చారు. ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షులు గురాన అయ్యలు, జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు అవనాపు విజయ్, జిల్లా స్క్వాష్ అసోసియేషన్ , గురాన చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షురాలు గురానా రాధిక, ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి సి.హెచ్. వేణుగోపాలరావులతో పాటు వివిధ క్రీడా సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.




## ఆర్ టీ సి కార్మికుల ధర్నా..

**జంగారెడ్డిగూడెం -జయ జయహే**

ఆర్టీసీ ఉద్యోగ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ డిపో వద్ద మంగళవారంకార్మికులు ధర్నా నిర్వహించారు. కార్మికుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని కోరుతూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఏలూరు జిల్లా నేషనల్ మజ్దూర్ యూనియన్ అధ్యక్షుడు గారపాటి రాంబాబు మాట్లాడుతూ.. రాష్ట్ర ఆర్టీసీ ఉద్యోగ సంఘాల జేఏసీ పిలుపుమేరకు రెండు రోజులపాటు రాష్ట్రంలోని ఆర్టీసీ డిపోల వద్ద ధర్నాలు నిరసనలు కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు.విద్యుత్ బస్సులు ప్రవేశపెట్టి వాటిని ప్రైవేటు వ్యక్తులకు దారా దత్తం చేసి ఆర్టీసీని క్రమేపి ప్రైవేటీకరణ చేయాలని ఉద్దేశంలో ప్రభుత్వం ఉందని పేర్కొన్నారు.ప్రభుత్వం కొత్తగా తీసుకునే విద్యుత్ బస్సులను ప్రైవేటు వారికి ఇస్తే తాము తీవ్రంగా వ్యతిరేకిస్తామని ఆయన హెచ్చరిక చేసారు. అవి ఆర్టీసీ ఆధ్వర్యంలోనే నిర్వహించాలని,అలాగే ఫ్రీబస్ స్త్రీ శక్తి పథకం సాఫీగా నిర్వహించాలంటే 4000 కొత్త బస్సులు కొనుగోలు చేయాలని, పాడైపోయిన డొక్కు బస్సులతోనే స్త్రీ శక్తి పథకం నిర్వహించాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. గత రెండేళ్లుగా కొత్త రిక్రూట్మెంట్లు లేవని, అదేవిధంగా పిఆర్సి, ఐ ఆర్ నిధులు చెల్లించాలని, పెండింగ్లో ఉన్న నాలుగు డిఏలు వెంటనే ఇవ్వాలని ఉద్యోగ సంఘాల జేఏసీ తరఫున ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ ఆర్టీసీ యూనియన్ సంఘాల నాయకులు, ఆర్టీసీ కార్మికులు పాల్గొన్నారు.



## కేంద్రమంత్రి శ్రీనివాస వర్మతో మార్నింగ్ కాఫీ క్లబ్ సభ్యుల ఆత్మీయ కలయిక

**భీమవరం (జయ జయహే )**

నరేంద్ర మోదీ ప్రధానమంత్రిగా విజయ వంతంగా 12 ఏళ్ల సుపరిపాలన పూర్తి చేసుకున్న సందర్భంగా కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ నర్సాపురం పార్లమెంట్ నియోజకవ ర్గ పరిధిలోని పలువురు ప్రముఖ వ్యాపారవేత్తలు, వైద్యులు, విద్యావేత్తలను వారి నివాసాలకు వెళ్లి మర్యాద పూర్వకంగా కలిశారు. మార్నింగ్ కాఫీ క్లబ్ కన్వీనర్ బొండా రాంబాబు, పిఆర్వో భట్టిప్రోలు శ్రీనివాసరావు లతోపాటు సభ్యులు కంచర్ల భాస్కర రావు, పులవర్తి రామకృష్ణ ఆత్మీయంగా కలిసి పలకరించారు. కేంద్ర ప్రభుత్వం సాధించిన అపూర్వ విజయాలు, అద్భుతమైన అభివృద్ధి గురించి కేంద్రమంత్రి వారితో సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం కేంద్ర ప్రభుత్వ ప్రగతికి సంబంధించిన ప్రత్యేక పుస్తకాలను వారికి బహూకరించారు. దేశ ప్రగతిలో మేధావులు, వ్యాపారవేత్తల పాత్ర ఎంతో కీలకమైనదని, మోదీ దార్శనికతతో భారతదేశం మరింతగా ముందుకు దూసుకుపోతుందనే అపారమైన నమ్మకాన్ని తాను కలిసిన ప్రతి ఒక్కరూ వ్యక్తం చేశారని కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ పేర్కొన్నారు. కారుమూరి భాస్కరరావు కూడా పాల్గున్నారు




## ఆటోఫెడరేషన్ మహాసభలు జయప్రదం చేయండి

**రాష్ట్ర నేత కోన పిలుపు**

**అనకాపల్లి జూన్ 23:(జయ జయహే )**

ఆగస్టు 8,9 తేదీల్లో విశాఖ లో జరిగే ఆంధ్రప్రదేశ్ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర 4వ, మహాసభలు జయప్రదం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు ఫెడరేషన్ గౌరవ అధ్యక్షులు కోన లక్ష్మణ పిలుపు నిచ్చారు. మంగళవారం పట్టణం లో చోడవరం బస్ స్టాండ్ వద్ద జరిగిన సమావేశం లో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఆటో అండ్ మోటార్ కార్మికులు అనేక సమస్యలతో సతమతమవుతున్నారు. ప్రభుత్వాలు వాహన మిత్ర హిత హామీని తుంగలో తొక్కాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జీవో నెంబరు 21,31 తో డ్రైవర్లపై భారీ జరిమానాలు వేసి ఉరితాడు తగిలిస్తున్నాయి. ఉచిత ఆర్టీసీ మహిళలకు ఫ్రీ బస్సు (స్త్రీ శక్తి పథకం) వల్ల ఆటో,మోటార్ కార్మికులు 60% దాకా ఆదాయాన్ని కోల్పోయారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పెట్రోలు, డీజీలు, సీఎన్జీ గ్యాస్, నిత్యవసర వస్తువులు ధరలను పెంచి తీవ్రమైన ఆర్థిక భారం వేస్తున్నాయి. అమ్మ పెట్టదు అడుక్కునివ్వదు అని సామెత గుర్తు చేశారు. ఫెడ రేషన్ జిల్లా అధ్యక్ష,కార్యదర్శి లు పెద్దిరెడ్ల నాగేశ్వరరావు,కోరిబిల్లి జగదీష్ మాట్లాడుతూ 15,000 వాహన మిత్ర 11 లక్షల మంది ఆటో, మ్యాక్సీ క్యాబ్ డ్రైవర్లందరికీ ఇవ్వాలన్నారు.జీవో నెంబరు 21,31ను వెంటనే రద్దు చేయాలి. చెల్లిస్తున్న పన్నుల నుండి 1% సెస్ కలెక్ట్ చేసి ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి.ఉచిత ఆర్టీసీ స్త్రీ, శక్తి పథకం వల్ల ఆదాయం కోల్పోయిన డ్రైవర్లకు నెలకు ప్రత్యేక జీవన భృతి కల్పించాలి. పెంచిన పెట్రోల్, డీజిల్, సీఎన్జీ గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలి. ప్రైవేట్ ఫైనాన్స్ వేధింపుల నుండి డ్రైవర్లకు చట్టపరమైన రక్షణ కల్పించాలని కోరారు. కార్యక్రమం లో అప్పన్న దొర, మామిడి శంకర రావు, బల్లిరెడ్డి దేవుడు బాబు, కాంద్రేగుల ఉమా, గండి బోయిన ప్రసాద్, అచ్చుతరావు, మోహన్ రావు, నారాయణ,నాయుడు, సతీష్, పల్ల నూకరాజు, కె శ్రీను, తదితరులు పాల్గొన్నారు



## ధవళేశ్వరం బ్యారేజీ వద్ద విషాదం..

**స్నానానికి వెళ్లిన ఇద్దరు యువకులు గోదావరిలో మునిగి మృతి**

**రాజమహేంద్రవరం: జయ జయహే: జూన్23:**

ధవళేశ్వరం బ్యారేజీ దిగువన ఉన్న ఇసుక రేవుల వద్ద ముగ్గురు స్నేహితులు స్నానానికి దిగగా ప్రమాదవశాత్తు పెద్దిపాటి హేమంత్ (19), పెద్దిపాటి చిన్ను (16) గోదావరి ప్రవాహంలో మునిగి మృతి చెందారు. వారితో పాటు ఉన్న మహమ్మద్ హసన్ రాజా సురక్షితంగా బయటపడ్డాడు. సమాచారం అందుకున్న ధవళేశ్వరం సిఐ గణేష్, ఎస్సై హరిబాబు సంఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలను పర్యవేక్షించారు. మృతి దేహాల్ని వెలికి తీసి ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## మాజీ సిఎం జగన్‌పై అనుచిత వ్యాఖ్యలు పంతం నానాజీ బహిరంగ క్షమాపణ చెప్పాలి

**ముద్దాల తిరుపతిరావు**

**రాజమహేంద్రవరం: జయ జయహే:**




జూన్23:ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డిపై కాకినాడ రూరల్ జనసేన ఎమ్మెల్యే పంతం నానాజీ చేసిన అనుచిత వ్యాఖ్యలను ఆంధ్రప్రదేశ్ స్టేట్ కాపు కార్పొరేషన్ డైరెక్టర్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ట్రేడ్ యూనియన్ తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షులు ముద్దాల తిరుపతిరావు తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.బాధ్యతాయుతమైన ఎమ్మెల్యే పదవిలో ఉండి, మాజీ ముఖ్యమంత్రి దివంగత నేత వైయస్ రాజశేఖర్ రెడ్డి తనయుడైన జగన్మోహన్ రెడ్డి ఇటువంటి వ్యాఖ్యలు చేయడం సరికాదని, పంతం నానాజీ వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని ముద్దాల డిమాండ్ చేశారు.చేసిన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని, లేని పక్షంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున జిల్లావ్యాప్తంగా పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు, ఉద్యమానికి దిగుతామని హెచ్చరించారు. కాపులకు మొదటి ప్రాధాన్యత ఇస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ఎమ్మెల్యేలు, ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని ముద్దాల కోరారు. కాపు కార్పొరేషన్ రుణాలు, విదేశీ విద్యా పథకాలపై దృష్టి సారించాలని, అనవసరమైన రాజకీయ విమర్శలు మానుకోవాలని సూచించారు. గత ప్రభుత్వంలో వైయస్ జగన్మోహన్ రెడ్డి కాపులతో పాటు అన్ని వర్గాల ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలను ఆయన గుర్తు చేశారు. అటువంటి నాయకుడిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం ద్వారా ప్రజల మనోభావాలను దెబ్బతీయొద్దని ఆయన పేర్కొన్నారు.



## కనిమా మసీదు అభివృద్ధికి రూ.15 లక్షల సాయం

**హామీ ఇచ్చిన మాట నిలబెట్టుకున్న ఎమ్మెల్యే వాసు**

**రాజమహేంద్రవరం: జయ జయహే : జూన్23:**

ముస్లిం మైనారిటీల సంక్షేమం, మతపరమైన ప్రదేశాల అభివృద్ధికి తమ కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) అన్నారు. స్థానిక నారాయణపురంలోని కనిమా మసీదు అభివృద్ధికి తన భవాని చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రూ.15 లక్షలు అందజేసి, పనులను ఆయన ప్రారంభించారు. మతాలకు అతీతంగా ప్రతి వర్గం అభివృద్ధి చెందాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని, ఇచ్చిన ప్రతి ఎన్నికల హామీని దశలవారీగా నెరవేరుస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. ఇప్పటికే నగరంలోని తాడితోట, అయేషా, బిలాల్ మసీదుల అభివృద్ధికి సైతం నిధులు కేటాయించినట్లు తెలిపారు. మైనారిటీల విద్య, ఉపాధి, సామాజిక భద్రతపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ నాయకులు మహ్మద్ అబ్దుల్లా (ఆపిల్), కూటమి నాయకులు కాశీ నవీన్ కుమార్, వై శ్రీను, ఉప్పులూరి జానకి రామయ్య, జామి సత్యనారాయణ, సయ్యద్ అప్సరి, లిమ్రాభాష, మహబూబ్ జానీ, ఎస్ కే బషీర్, ఖాన్ భాయ్, జిలాని, మసీదు కమిటీ సభ్యులు మరియు పెద్ద సంఖ్యలో ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

For a pure tomorrow.. జయహో



# జుట్టు రాలుతోందా?

## అయితే మీలో ఈ లోపం ఉన్నట్లే..

మారుతున్న జీవనశైలితో పాటు అనేక రకాల అనారోగ్య సమస్యలు వెంటాడుతున్నాయి. అందులో భాగంగా నీరసం, బలహీనత, అలసట వంటి అనేక రకాల సమస్యలను ఎదుర్కోంటున్నారు. ఈ కారణాల వల్ల చాలా మంది విటమిన్ డెఫిషియెన్సీతో బాధపడుతుంటారు. విటమిన్లలో ఏ ఒక్క విటమిన్ లోపం ఏర్పడినా కూడా శరీరం అనారోగ్యం పాలవుతుంది. ఆరోగ్యంగా ఉండాలంటే అన్ని రకాల విటమిన్లు, పోషకాలు అందాలి. అయితే పోషకాలు అందకపోవడం వల్ల అనారోగ్య సమస్యలు తలెత్తుతుంటాయి. అందులో భాగంగానే హెయిర్ ఫాల్ కూడా ఓ సమస్యగా మారుతుంది. నీటి కారణంగా లేక శరీరానికి తగిన విటమిన్ అందకపోవడం వల్ల జుట్టు రాలడం వంటి సమస్యలు తలెత్తుతున్నాయి. అందులో భాగంగా జింక్ లోపం ఏర్పడితే జుట్టు రాలడం సమస్య ఏర్పడుతుందని నిపుణులు చెబుతున్నారు. అయితే కేవలం ఈ సమస్య మాత్రమే కాకుండా అనేక రకాల అనారోగ్య సమస్యలు కూడా వస్తాయని అంటున్నారు.

### జింక్ లోపాన్ని ఎలా గుర్తించాలి..

శరీరంలో జింక్ లోపం ఏర్పడితే చాలా రకాల సమస్యలు ఎదురవుతాయి. శరీరానికి అనేక రకాల పోషకాలు అవసరం అందులో ముఖ్యమైనది జింక్ కూడా. అయితే జింక్ లోపం ఏర్పడితే జుట్టు రాలడం, రోగనిరోధక శక్తి, రక్త హీనత, విరేచనాలు, వంటి అనేక రకాల సమస్యలు ఏర్పడతాయి.

### ఈ లక్షణాలు కనిపిస్తే అస్సలు అశ్రద్ధ చేయకూడదు..


**ఆకలి మందగించడం :**
జింక్ సమస్య తలెత్తడం వల్ల ముందుగా ఆహారం తినాలనిపించదు. అంతేకాదు రుచి, వాసన కూడా అర్థం కాదు. ఆకలి తగ్గడం కూడా ప్రారంభం అవుతుంది.

**అంటు వ్యాధులు :**
శరీరంలో జింక్ లోపం ఏర్పడితే ఇన్ఫెక్షన్ల బారిన పడతారు. జింక్ లోపం వల్ల రోగనిరోధక శక్తి కూడా బలహీనపడుతుంది. అంతేకాదు బ్యాక్టీరియా, వైరస్ వంటివి కూడా సోకే అవకాశాలు ఉంటాయి.

**గాయాలు మానవు :**
గాయాలను నయం చేయడానికి జింక్ అవసరం. జింక్ లోపం ఏర్పడిన వారిలో గాయాలు అయితే అవి త్వరగా మానవు. జింక్ లోపం వల్ల గాయం ఇన్ఫెక్షన్‌గా మారుతుంది.

**జుట్టు రాలడం :**
జింక్ లోపం ఏర్పడితే జుట్టు రాలడం ప్రారంభమవుతుంది. దీంతో జుట్టు సన్నగా మారుతుంది. అంతేకాదు తలపై రంధ్రాలు ఏర్పడతాయి.

**నివారణ మార్గాలు..**
జింక్ లోపం ఉన్న వారిలో ఈ లక్షణాలు ఏర్పడతాయి. వీటితో బాధపడేవారు వైద్యులను సంప్రదించాలి. ముఖ్యంగా ఓట్స్, రెడ్ మీట్, గుమ్మడి గింజలు, విత్తనాలు, జీడిపప్పు, పండ్లు వంటి తీసుకోవడం వల్ల జింక్ ఎక్కువగా అంది లోపం నుంచి ఉపశమనం కలుగుతుంది.




## ఆరోగ్య సమస్యల నుండి బయటపడేందుకు

# కుంకుమ పువ్వు



**కుంకుమపువ్వు ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన సుగంధ ద్రవ్యాల్లో ఒకటి. నిజానికి కుంకుమ పువ్వును క్రోకస్ సాటివస్ అనే మొక్క పువ్వు పుప్పొడి నుంచి సేకరిస్తారు. ఈ పుప్పొడి రేకులను ఎండబెట్టి కుంకుమ పువ్వుగా చేస్తారు. కుంకుమపువ్వును ఆంగ్లంలో సాఫ్రాన్ అంటారు. కుంకుమపువ్వును రకరకాల స్వీట్లను తయారు చేయడం వాడుతారు. ఆయుర్వేదం పరంగా కూడా దీన్ని తీసుకోవడం ద్వారా శరీరాన్ని ఫిట్‌గా ఉంచుకోవచ్చు. కుంకుమపువ్వులో ఐరన్, కాల్షియం, మెగ్నీషియం, ఫాస్పరస్, థయామిన్, ఫోలేట్, విటమిన్ బి6, కాపర్ వంటి పోషకాలు లభిస్తాయి. కుంకుమ పువ్వు ఆయుర్వేదంలో ఒక అద్భుతమైన ఔషధ మూలిక. అనేక ఆరోగ్య సమస్యల నుండి బయటపడేందుకు కుంకుమపువ్వును తీసుకుంటారు. కుంకుమ పువ్వు వల్ల కలిగే ముఖ్యమైన ప్రయోజనాలు**

### నిద్ర నాణ్యతను మెరుగుపరుస్తుంది:

కుంకుమపువ్వులో ఒత్తిడిని తగ్గించే చాలా శక్తివంతమైన పదార్థాలు ఉన్నాయి, ఇవి మీ మానసిక ఒత్తిడిని తగ్గిస్తాయి. మీరు బాగా ఎక్కువసేపు నిద్రపోవడానికి సహాయపడతాయి. మీకు నిద్రలేమి వంటి సమస్యలు ఉంటే, మీరు ప్రతిరోజూ కుంకుమపువ్వును తీసుకోవాలి. ఇది మీ నిద్ర నాణ్యతను మెరుగుపరచడంలో సహాయపడుతుంది.

### జీర్ణ సంబంధిత సమస్యల నుండి ఉపశమనం:

ఔషధ గుణాలు కలిగిన కుంకుమపువ్వును తీసుకోవడం వల్ల జీర్ణ సంబంధిత సమస్యలు నయమవుతాయి. గ్యాస్, అజీర్ణం ఆమ్లత్వం మొదలైన వాటి నుండి ఉపశమనం వంటిది. కాబట్టి రోజూ పాలతో కుంకుమపువ్వును తినండి.

### కుంకుమపువ్వు కంటి చూపును మెరుగుపరుస్తుంది:

కుంకుమపువ్వు కళ్లను ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడతాయి. వయసు పెరిగే కొద్దీ దృష్టిలోపం ఉన్నవారు కుంకుమపువ్వు తీసుకోవడం వల్ల ప్రయోజనం పొందుతారు. ఇందులో క్రోసిన్ సఫ్రానల్ వంటి కెరోటినాయిడ్లు ఉన్నాయి, ఇవి కంటి చూపును మెరుగుపరచడంలో సహాయపడతాయి.

### జ్ఞాపకశక్తిని బలపరుస్తుంది:

ఆయుర్వేద వైద్య పద్ధతుల ప్రకారం, కుంకుమపువ్వు మానసిక శక్తిని పెంపొందించడంలో చాలా ప్రభావవంతమైనదిగా పరిగణించబడుతుంది. ఇందులో కుంకుమపువ్వులో ఉండే ప్రత్యేక యాంటీఆక్సిడెంట్లు అల్జీమర్స్ వ్యాధి లక్షణాలను తగ్గించడంలో సహాయపడతాయి.

### బరువును తగ్గిస్తుంది:

ఒక చిటికెడు కుంకుమపువ్వు మీ ఆకలిని అరికట్టడంలో సహాయపడుతుంది, తద్వారా మీకు అతిగా తినే అలవాటు ఉంటే దానిని దూరం చేస్తుంది. బరువు తగ్గాలనుకునే వారికి కుంకుమపువ్వు తీసుకోవడం మంచి ఆప్షన్ అని చెప్పవచ్చు. .

### చర్మ సౌందర్యం పెంచుతుంది:

కుంకుమపువ్వులోని యాంటీ బ్యాక్టీరియల్ లక్షణాలు మొటిమలు, బ్లాక్ హెడ్స్ మచ్చలు వంటి చర్మ సంబంధిత సమస్యలను నయం చేయడంలో సహాయపడతాయి.

### కుంకుమపువ్వు ఎలా తీసుకోవాలి?

కుంకుమపువ్వును అనేక రకాలుగా ఉపయోగించవచ్చు. పాలలో కుంకుమపువ్వు కలిపి త్రాగడం ఒక మంచి పద్ధతి. కుంకుమపువ్వులో అనేక ఆరోగ్యాన్ని పెంపొందించే లక్షణాలు ఉన్నాయి, కాబట్టి దీనిని అనేక సాంప్రదాయ ఔషధాలలో కూడా ఉపయోగిస్తారు. అయితే కుంకుమ పువ్వు అతిగా వాడితే అజీర్తి చేసే అవకాశం ఉంటుంది. అందుకే మీ ఆరోగ్య పరిస్థితిని బట్టి కుంకుమపువ్వు ఎంత మోతాదులో తీసుకోవాలో తెలుసుకోవడానికి వైద్యుడిని సంప్రదించండి.



# కేంద్ర బడ్జెట్‌లో టెక్నాలజీ రంగానికి ప్రాధాన్యత దక్కనుందా?

## ఈ ఉత్పత్తుల ధరలు తగ్గనున్నాయా?



కేంద్ర ప్రభుత్వం జులై 23న పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టనుంది. ఎన్నికల ముందు మధ్యంతర బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్.. పూర్తిస్థాయి బడ్జెట్‌ను కూడా ప్రవేశపెట్టనున్నారు. ఈ బడ్జెట్ 2024పై అనేక రంగాల్లో భారీ అంచనాలున్నాయి. వీరితోపాటు టెక్నాలజీ రంగం కూడా భారీ ఆశలు పెట్టుకుంది. ఇందులో భాగంగా ఇవాళ కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఆర్థిక సర్వేను ప్రవేశపెట్టారు. కేంద్ర బడ్జెట్ 2024 లో ల్యాప్‌టాప్, మొబైల్ ధరలు తగ్గే అవకాశం ఉందని తెలుస్తోంది. వీటితోపాటు టీవీలు, కెమెరా లెన్స్‌లపై కస్టమ్స్ డ్యూటీ లు తగ్గే అవకాశం ఉంది. ఇలా టెక్నాలజీ రంగంలో భారీ అంచనాలు ఉన్నాయి. అయితే రేపు ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌లో ఎలా ఉండే అవకాశం ఉంది. టెక్నాలజీ అభివృద్ధికి ఎన్ని నిధులు కేటాయించే అవకాశం ఉంది. కేంద్ర బడ్జెట్ 2024 లో మొబైల్, ల్యాప్‌టాప్, ఎల్ఈడీ టీవీలు, కెమెరా లెన్స్‌ల టారిఫ్‌లు తగ్గే అవకాశం ఉంది. అయితే దీనిపై ఇప్పటి వరకు ఎటువంటి అధికారిక ప్రకటన రాలేదు. అయితే ఇయర్‌ఫోన్, స్మార్ట్‌వాచ్‌ల ధరలు పెరుగుతాయని తెలుస్తోంది. అయితే ఇది వినియోగదారులకు కొంచెం నిరాశను కలిగించే అవకాశం ఉంది. కేంద్ర బడ్జెట్‌పై ఫిన్‌టెక్, రిటైల్, ఈ-కామర్స్, ఫార్మా, తయారీ, లాజిస్టిక్స్, టెలికాం వంటి అనేక రంగాల్లో ఆవిష్కరణలు సహా అభివృద్ధి, డిజిటలైజేషన్ వంటి అంశాలపై దృష్టిసారించాల్సిన అవసరం ఉంది. సైబర్ సెక్యూరిటీ, డిజిటల్ సొల్యూషన్స్, సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ వంటి రంగాల్లో భారత్ ఐటీ పరిశ్రమ పోటీతత్వాన్ని పెంచడం పైనా దృష్టిసారించాలి. 2023-24 బడ్జెట్‌లో సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖకు రూ.16361 కోట్లు కేటాయింపులు చేశారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కోసం కొత్త కేంద్రాల ఏర్పాటు చేయడం సహా అనేక ప్రాజెక్టుల కేసం ప్రత్యేక కేటాయింపులు చేసింది. అయితే ఈ సంవత్సరం బడ్జెట్‌లోనూ ఈ శాఖకు ప్రాధాన్యత లభిస్తుందని భావిస్తున్నారు. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఆర్థిక సర్వేను ప్రవేశపెట్టారు. 2030 నాటికి దేశ ఆర్థిక వ్యవస్థలో 78.5 లక్షల ఉద్యోగాల కల్పన అవసరమని సర్వే తెలిపింది. దీంతోపాటు వివిధ రంగాలపై ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రభావం ఎలా ఉంటుందనే అంశంపై అనిశ్చితి నెలకొందని ఆర్థిక సర్వే తెలిపింది. టెక్నాలజీ కారణంగా పని విధానాల్లో అనేక మార్పులు చోటుచేసుకొనే అవకాశాలు ఉన్నాయని, మరియు కొన్ని రంగాల్లో ఆటోమేషన్ రానుందని తెలిపింది. దీంతోపాటు అనేక రంగాల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగం పెరుగుతుందని ఆర్థిక సర్వే - 2024 పేర్కొంది.

Publisher suresh peddinti printed and published by him on behalf of SWANSIKAASRE PUBLICATIONS PUBLISHED AT 49-54-5/1, BALAYYASASTRY LAY OUT, VISAKHAPATNAM, 530013, 0891 2519333, 9603 22 3333, APTEL 2021/15454.feedback :jayajayahey@gmail.com